RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ | 04 అక్టోబర్ 2025 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:105

## విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్

# తెలంగాణ

### పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని

### పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం

### 'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు









**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** 'విలువలతో కూడిన వృద్ధి'కి కేరాఫ్ గా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్, హెచ్ఐసీసీలలో మూడ్రోజుల పాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటన్నారన్నారు. ముఖ్యంగా వృద్ధి నైతికమైనదా, సమ్మిళితమైనదా, సుస్థిరమైనదా..? అని అధ్యయనం చేసిన తర్వాతే అడుగు ముందుకేస్తున్నారన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు. తెలంగాణ అవకాశాల ఖని అని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని వివరించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఒక్కసారి తెలంగాణలో పర్యటించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్ తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు. నిజమైన యూనికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయడమని యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జీటో హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచాలియా, బీఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అలయ్ బలయ్

### హాజరైన వెంకయ్య, కోమటిరెడ్డి, నాగార్జున, సుజనా చౌదరి



హైదరాబాద్, అక్టోబరు 3, నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రతి సంవత్సరం దసరా పండుగ ముగిసిన మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమం సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో దత్తాత్రేయ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈరోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన అతిథులకు దత్తాత్రేయ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, సినీ నటులు నాగార్జున, బ్రహ్మానందం, ఏపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, సీపీఐ నేత నారాయణ, తెలంగాణ జన సమితి నేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత వి. హనుమంత రావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, వేష భాషలు వేరైనా మనమంతా భారతీయులమనే భావనతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అందరం ఐక్యంగా ఉండాలనే సదుద్దేశంతో అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దత్తాత్రేయ గత ఇరవై సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కొందరు కులం, మతం, వర్గం, జాతి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి ప్రయత్నాలు విఫలం కావడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు.

## ఫలక్ నుమా ఆర్వోబీని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధిహైదరాబాద్, అక్టోబర్ 3, 2025:**జీహెచ్ఎంసీ నిధులు రూ 52.03 కోట్ల వ్యయంతో నిర్మించిన సికింద్రాబాద్ – ఫలక్‌నుమా బ్రాడ్‌గేజ్ లైన్‌లోని ఫలక్‌నుమా వద్ద ఆర్ఓబీకి సమాంతర ఆర్ఓబీనీ శుక్రవారం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తో కలిసి ప్రారంభించారు.

కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసుదుద్దీన్ ఒవైసీ , ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, మీర్జా రహమత్ బేగ్ , ఎమ్మెల్యేలు మహమ్మద్ ముబీన్, మీర్ జల్ఫికర్ అలీ ,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్ లు,తదితరులు పాల్గొన్నారు.



ఆర్వోబీ ప్రారంభంతో...

ఫలక్ నుమాలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

పాతబస్తీ ఫలక్ నామాలో నేటి నుంచి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సికింద్రాబాద్ నుంచి ఫలక్ నామా బ్రాడ్ గేజ్ లైన్ వద్ద ఉన్న ఆర్వోబీకి సమాంతరంగా జీహెచ్ఎంసీ ఆర్వోబీ నీ నిర్మించింది. రూ.52. కోట్లతో 4 వరుసల్లో ఆర్వోబీని జీహెచ్ఎంసీ నిర్మించింది. పాత ఆర్వోబీని పునరుద్దరించడంతో పాటు దానికి సమాతరంగా మరో ఆర్వోబీని నిర్మించడంతో బార్కస్ జంక్షన్ నుంచి ఫలక్ నామా బస్ డిపో, రైల్వే స్టేషన్, చార్మినార్ వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయి. సమయం ఆదాతోపాటు గంటల తరబడి నిలిచిపోయే ట్రాఫిక్ నుంచి ఊరట లభించనుంది. ఫలక్‌నుమా ఆర్ఓబీనీ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రపంచ దేశాలకు భారత్ దారిచూపుతోంది: బిల్ గేట్స్



న్యూఢిల్లీ, అక్టోబరు 3, (న్యూస్ పల్స్) మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్ భారత్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ఆవిష్కరణల రంగంలో భారత్ ఒక ప్రపంచ స్థాయి నాయకుడిగా నిలుస్తోందని, అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు మార్గదర్శకంగా ఉందని ఆయన కొనియాడారు. భారత పరిష్కారాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను మెరుగుపరిచే శక్తిని కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సులేట్ జనరల్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ సంయుక్తంగా మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ఓ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి హాజరైన బిల్ గేట్స్ మాట్లాడుతూ... "ఈ రోజు భారత్ ఆవిష్కరణల్లో గ్లోబల్ లీడర్‌గా ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను కాపాడి, మెరుగుపరిచే పరిష్కారాలను అందిస్తోంది. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భారత్‌తో మా భాగస్వామ్యం కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు. గాంధీజీ ఆశయాలైన సమానత్వం, గౌరవం తమ ఫౌండేషన్ పనికి పునాది వంటివని గేట్స్ పేర్కొన్నారు.ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతి, కళలు, సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. వాషింగ్టన్, సియాటిల్ నగర ప్రభుత్వాల నుంచి సీనియర్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో 'ప్రస్తుత ప్రపంచంలో గాంధీ విలువల ప్రాముఖ్యత' అనే అంశంపై యూఎస్ గ్లోబల్ సెక్యూరిటీ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు జొనాథన్ గ్రానోఫ్ ప్రత్యేక ప్రసంగం చేశారు.అంతకుముందు, బెల్వ్యూ పబ్లిక్ లైబ్రరీ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి, సియాటిల్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. వాషింగ్టన్ స్టేట్ సెనేటర్ వందనా స్లాటర్ పుష్పాంజలి ఘటించారు. సియాటిల్, బెల్వ్యూ నగరాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భారత–అమెరికన్ సమాజం పాల్గొంది. ఈ సందర్భంగా చిన్నారులు గాంధీజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని భారత కాన్సులేట్ కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ప్రజాబలం

04 అక్టోబర్ 2025 శనివారం

# భారత్‌లో పెరుగుతున్న విడాకులు..

భారత్‌లో విడాకుల ట్రెండ్ భారీగా పెరుగుతోందని ఓ సర్వేలో వెల్లడైంది. ఇక విడాకులు తీసుకున్న తర్వాత పురుషులు ఎదుర్కొనే ఆర్థిక సంక్షోభంపై ఈ సర్వే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చింది. ఇక విడాకుల ఖర్చులు, విడాకుల తర్వాత భరణం చెల్లింపుల కోసం 42 శాతం మంది పురుషులు అప్పులు చేస్తున్నారని వెల్లడైంది. అదే సమయంలో పురుషులు సంపాదించే సంపాదనలో ఏటా 38 శాతం సొమ్మును.. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ కింద చెల్లిస్తున్నారని ఈ సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పురుషులపైనే పడుతోందని వెల్లడించిందిమన దేశంలో రోజురోజుకూ విడాకులు తీసుకుంటున్న వారి సంఖ్య అమాంతం పెరిగిపోతుండటం తీవ్ర సంచలనంగా మారుతోంది. అయితే విడాకులు అనేది కేవలం మానసిక వేదన మాత్రమే కాకుండా.. జీవితంలో ఎదురయ్యే అతిపెద్ద ఆర్థిక సంక్షోభం అని తాజాగా నిర్వహించిన ఒక కొత్త అధ్యయనం నిరూపించింది. భారతదేశంలోని టైర్ 1, టైర్ 2 నగరాల్లో విడాకులు తీసుకున్న కొంతమందిపై ఓ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో సంచలన విషయాలు బయటికి వచ్చాయి. విడాకుల తర్వాత ఒక పురుషుని ఆదాయంలో ఏడాదికి 38 శాతం భరణం , మెయింటెనెన్స్ వంటివి చెల్లించేందుకే ఖర్చు అవుతున్నట్లు వెల్లడించింది. అదే సమయంలో 42 శాతం మంది వ్యక్తులు.. విడాకుల సమయంలో చెల్లించే భరణం కోసం రుణాలు తీసుకుంటున్నట్లు తేలిందిఫైనాన్స్ మ్యాగజైన్ అనే సంస్థ భారత్‌లోని టైర్ 1, టైర్ 2 వంటి నగరాలకు చెందిన 1,258 మందిపై నిర్వహించిన 2025 సర్వే ప్రకారం.. విడాకుల ఆర్థిక భారం పూర్తిగా పురుషులపైనే పడుతోందని వెల్లడించింది. విడాకుల తర్వాత మెయింటెనెన్స్ చెల్లించేందుకు.. పురుషులు తమ వార్షిక ఆదాయంలో సగటున 38 శాతం ఖర్చు చేస్తున్నట్లు ఈ సర్వే వివరించింది. దాదాపు 49 శాతం మంది పురుషులు విడాకులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఇక ఇందులో మరో ఆందోళన కలిగించే విషయం ఏంటంటే.. 42 శాతం మంది పురుషులు భరణం చెల్లింపులు లేదా న్యాయ ప్రక్రియల కోసం రుణాలు తీసుకుంటున్నారని తెలిపింది.భరణం చెల్లించే పురుషుల్లో 29 శాతం మంది సెటిల్‌మెంట్ తర్వాత తమ ఆస్తుల నెట్ వర్త్ ప్రతికూలంగా మారిందని ఈ సర్వేలో వెల్లడించారు. ముందస్తు ప్రణాళిక లేకుండా ఇలాంటి విడాకుల ఖర్చులు ఉంటే.. ఆర్థికంగా చాలా సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోతారని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. విడాకులు తీసుకున్న పురుషుల్లో దాదాపు సగం మంది విడాకుల తర్వాత తమపై పడే ఆర్థిక భారాన్ని ముందుగా అంచనా వేయలేకపోతున్నారని ఈ సర్వే పేర్కొంది. కోర్టు ఫీజులు, లాయర్ ఖర్చులు, భరణం, పిల్లల నిర్వహణ ఖర్చులతో ఈ భారం భారీగా పెరుగుతోందని తెలిపింది.ఈ సర్వే పాల్గొన్న ఒక వ్యక్తి తన 7 ఏళ్ల న్యాయ పోరాటానికి సుమారు రూ.8-9 లక్షల వరకు ఖర్చు అయిందని.. దీనివల్ల మానసికంగా, ఆర్థికంగా తాను పూర్తిగా కుంగిపోయానని తెలిపారు. ఇటీవలి కాలంలో విడాకుల సమయంలో భరణం మొత్తాన్ని పెంచుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతున్నాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో మొత్తం విడాకుల రేటు దాదాపు 1 శాతం వద్ద తక్కువగానే ఉన్నప్పటికీ.. బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి పట్టణ ప్రాంతాల్లో గత కొన్నేళ్లలో విడాకుల కేసులు 30 నుంచి 40 శాతం పెరిగినట్లు తెలుస్తోంది.బాంబే హైకోర్టు, ఫ్యామిలీ కోర్టులో లాయర్ అయిన అదితి మోహోని భార్యాభర్తల జీవితంలో వచ్చే ఆర్థిక నష్టాన్ని నివారించడానికి లేదా దాన్ని తగ్గించడానికి కొన్ని కీలక సూచనలు చేశారు. పెళ్లికి ముందు భార్యాభర్తలు ఇద్దరూ స్పష్టమైన ఆర్థిక నియమాలను ఏర్పరచుకోవాలని.. వాటిని డాక్యుమెంట్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఆదాయాన్ని ఎలా పంచుకోవాలి అనేదానిపై నిర్ణయం తీసుకుని జాయింట్ అకౌంట్ ఓపెన్ చేయాలని సూచించారు. భార్యాభర్తల్లో ఒకరు ఉద్యోగం చేయకుండా ఇంట్లోనే ఉంటే.. వారి పేరు మీద ఆస్తులు లేదా బీమాను సృష్టించాలని తెలిపారువిడాకుల సమయంలో ఆస్తులు, అప్పులు, ఆదాయం, భరణం, పిల్లల పోషణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని, రికార్డుల కాపీలను భద్రపరుచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. హక్కులను కాపాడుకోవడానికి, సాఫీగా మారడానికి ఫ్యామిలీ లాయర్ లేదా ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఆర్థిక విషయాల్లో భార్యాభర్తలిద్దరూ ముందే ఒక అభిప్రాయానికి వస్తే.. తర్వాత ఎదురయ్యే ఒత్తిడిని నివారించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. విడాకులకు సంబంధించిన న్యాయ ప్రక్రియలను ప్రారంభించడానికి ముందే కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇది లీగల్ ఫీజులు, అద్దె, రోజువారీ ఖర్చులకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

# డబుల్ బెడ్ రూం పట్టాలు పంపిణీ చేసిన పొన్నం ప్రభాకర్





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్‌గతంలో డబుల్ బెడ్ రూం కేటాయించి కోర్టు కేసులో ఆగిపోయి కోర్టు నుండి క్లియరెన్స్ వచ్చినచార్మినార్ ,మలక్ పేట , యాకత్ పుర , చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాలకు సంబంధించిన లబ్ధిదారులకు మినిస్టర్ క్వార్టర్స్ లో డబుల్ బెడ్ రూం పట్టాలు పంపిణీ చేసిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు..GHMCప్రాంత నివాసితులకు 2 BHK ఇళ్ల కేటాయింపు పథకంలో భాగంగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంకల్ గ్రామంలో 2 BHK ఇళ్ల నిర్మాణాన్ని %+ఎవీజ% చేపట్టింది.
కలెక్టర్, రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాకు చెందిన 1730 మంది లబ్ధిదారుల జాబితాను ప్రచురించారు మరియు మంకల్-ఫేజ్-II స్థానంలో 2 BHK ఇళ్లను కేటాయించారు.
అందులో భాగంగా చార్మినార్ ,మలక్ పేట ,యాకత్ పుర ,చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఉన్న లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు
అంబర్ పేట - 134,బహుదూర్ పుర - 294,బండ్లగూడ - 155,చార్మినార్ - 209 సైదాబాద్ - 206 ,ఇతర ప్రాంతాల్లో ఉన్న 28 డబుల్ బెడ్ రూం లలో మొత్తం 1024 మంది లబ్ధిదారుల్లో ఈరోజు మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా 75 మంది పట్టాలు అందుకున్నారు.. మిగిలిన లబ్ధిదారులకు స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో పట్టాలు పంపిణీ చేయనున్నారు.

# భారత్ ఎన్నటికీ తలవంచదు.., అవమానాన్ని సహించదు వాణిజ్య లోటును సరిచేస్తామని పుతిన్ హామీ



న్యూఢిల్లీ, అక్టోబరు 3, (న్యూస్ పల్స్) రష్యాతో ఇంధన వాణిజ్యం తగ్గించుకోవాలంటూ భారత్‌పై అమెరికా తెస్తున్న ఒత్తిడిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భారత్ ఎన్నటికీ బయటి శక్తుల ఒత్తిళ్లకు తలొగ్గదని, అలాంటి అవమానాన్ని ఎప్పటికీ సహించదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో అమెరికా వెనక్కి తగ్గకపోతే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే భారీ నష్టం తప్పదని గట్టిగా హెచ్చరించారు.రష్యాలోని సోచి నగరంలో జరిగిన వాల్డాయ్ అంతర్జాతీయ చర్చా వేదికలో పుతిన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి భారత్ సహా 140 దేశాల నుంచి భద్రతా, భౌగోళిక రాజకీయ నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ “భారత్‌తో మాకు ఎలాంటి సమస్యలు లేవు, ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తలేదు. ప్రధాని నరేంద్ర మోదీ నా స్నేహితుడు. ఆయన నాయకత్వంలో భారత్ ఎవరి ఒత్తిళ్లకూ లొంగదు. అమెరికా మాట విని రష్యా నుంచి ఇంధనం కొనడం ఆపేస్తే భారత్ దాదాపు 9 నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు నష్టపోవాల్సి వస్తుంది” అని వివరించారు.అమెరికా చర్యలు ఆ దేశానికే నష్టం కలిగిస్తాయని పుతిన్ హెచ్చరించారు. రష్యా వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలు విధిస్తే, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగిపోతాయని అన్నారు. ఇది అమెరికా ఫెడరల్ రిజర్వ్‌పై ఒత్తిడి పెంచి, వడ్డీ రేట్లను అధికంగా ఉంచేలా చేస్తుందని, తద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థ మందగిస్తుందని విశ్లేషించారు.

వాణిజ్య లోటుపై హామీ

భారత్ భారీగా ముడి చమురును దిగుమతి చేసుకోవడం వల్ల ఏర్పడిన వాణిజ్య అసమతుల్యతను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని పుతిన్ హామీ ఇచ్చారు. “భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలను అధికంగా కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నాం” అని ఆయన తెలిపారు. డిసెంబర్ నెలలో జరగనున్న తన భారత పర్యటన కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పుతిన్ పేర్కొన్నారు.

అమెరికా ద్వంద్వ నీతిపై విమర్శ

ఇదే సమయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ నీతిని పుతిన్ ఎండగట్టారు. “అణు విద్యుత్ కోసం అమెరికాకు పెద్ద మొత్తంలో ఇంధనం అవసరం. వారికి యురేనియం సరఫరా చేస్తున్న దేశాల్లో రష్యా రెండో స్థానంలో ఉంది. ఓ వైపు మా నుంచి యురేనియం కొనుగోలు చేస్తూ, మరోవైపు ఇంధన వాణిజ్యం విషయంలో భారత్‌పై ఒత్తిడి తేవడం అమెరికా ద్వంద్వ వైఖరికి నిదర్శనం” అని ఆయన విమర్శించారు.

# బ్రహ్మోస్ కంటే భీకరం.. భారత్ అమ్ములపొదిలో చేరనున్న ధ్వని మిస్సైల్

న్యూ డిల్లీ అక్టోబర్ 3 ;రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారతదేశం అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్‌లు, డ్రోన్ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులోభాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ ‘ధ్వని ‘ పరీక్షలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా వేస్తున్నారు.ఇదిలావుంటే అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్దవేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీని సుమారు గంటకు 7 వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. 1500 నుంచి 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా వేస్తున్నారు. వేగంతోపాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉన్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజ్‌మెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి ‘ధ్వని’ పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

## నాగార్జున సాగర్ జలాశయానికి కొనసాగుతున్న వరద.. 22 గేట్లు ఎత్తివేత



హైదరాబాద్ అక్టోబర్ 3 నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఈ క్రమంలో జలాశయం నిండుకుండలా మారింది. దీంతో సాగర్ 22 గేట్లు ఎత్తి దిగువకు 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ఇన్‌ఫ్లో 2.94 లక్షల క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2.22 లక్షల క్యూసెక్కులుగా ఉంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 302.91 టీఎంసీలుగా ఉంది.శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా స్థిరంగా వరద కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3,95,563 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 3,46,374 క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం 10 స్పిల్ వే గేట్లు ఎత్తి 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 209.15 టీఎంసీలుగా ఉంది.

# జనసేన పార్టీలో కీలక మార్పులు- నాగబాబు పదవి రామ్ తాళ్లూరికి

విజయవాడ, అక్టోబరు 3, జనసేన పార్టీ వ్యవహారాలను చూసే బాధ్యతలను రామ్ తాళ్లూరి కి అప్పగిస్తూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారు. రామ్ తాళ్లూరి ఇక నుంచి పార్టీ సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాన కార్యదర్శి హోదాలో నిర్వహిస్తారని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా రామ్ తాళ్లూరిని నియమించినట్లు అయింది. ఆయన పార్టీ అంతర్గత అంశాలను చూసుకుంటారని ప్రకటించారు. ఇప్పటి వరకూ ప్రధాన కార్యదర్శిగా నాగబాబు చూస్తున్న వ్యవహారాలు మొత్తం ఇక నుంచి రామ్ తాళ్లూరి చూస్తారు. ఇప్పటికే జనసేన పార్టీ ఐటీ విభాగాన్ని రామ్ తాళ్లూరినే చూసుకుంటున్నారు. నాగబాబు బాధ్యతలు కూడా ఆయనకే ఇస్తూ పవన్ నిర్ణయం తీసుకున్నారు. జనసేన పార్టీ స్థాపించినప్పటి నుండి ఆయన కలిసి పని చేస్తున్నారు. తన నియామకంపై రామ్ తాళ్లూరి సంతోషం వ్యక్తం చేశారు. పవన్ ను మొదటిసారి కలిసిన రోజు నుంచి అదే ఉత్సాహం, ప్రజల కోసం అంకితభావం కొనసాగుతోందన్నారు. పార్టీ వ్యవహారాల కోసం నాగబాబు ఎక్కువ సమయం కేటాయించలేకపోవడం .. ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా జనసేన వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణించాలని పవన్ కల్యాణ్ ఆలోచిస్తున్నారు. ఈ నియామకం అందుకు ఉపయోగపడుతుందని అనుకుంటున్నారు. రామ్ తాళ్లూరి ఖమ్మంజిల్లాకు చెందిన ఎన్నారై. సినిమాలు కూడా నిర్మించారు. పవన్ కల్యాణ్‌కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందారు. రామ్ తాళ్లూరి అమెరికాలో లీడ్ ఐటీ కార్ప్ , ఫ్లై జోన్ ట్రాంపోలిన్ పార్క్, రామ్ ఇన్నోవేషన్స్ (రియల్ ఎస్టేట్) వంటి వ్యాపారాలను నడుపుతున్నారు. సినిమా రంగంలో ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సినిమాలు నిర్మించారు.

పిఠాపురం జనసేనలో మర్రెడ్డి శ్రీనివాసరావు మార్పు తప్పదా?

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన ఇంచార్జ్ ఎవ్వరు అనేదానిపై పెద్ద డౌట్ వ్యక్తం అవుతోంది.. ఎందుకంటే పిఠాపురం జనసేన పార్టీ ఇంచార్జ్‌గా వ్యవహరిస్తోన్న మర్రెడ్డి శ్రీనివాసరావును ఆ బాధ్యతల నుంచి తప్పిస్తున్నారన్న ప్రచారం స్థానికంగా జోరుగా సాగడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.. స్థానికంగా ఆయనపై పార్టీలో ఉన్న అసంతృప్తే ఆయన పెద్దగా చురుగ్గా ఉండడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.. అయితే ఆయనకు పార్టీ అధినేత నుంచి పుష్కలంగా ఆశీస్సులు ఉండడం, ఆయనపై అధిష్టానానికి సానుకూలత ఉండడంతో ఆయన ముందుండి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అయితే గత కొంత కాలంగా ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌పై వస్తున్న పుకార్ల ఈనేపథ్యంలోనే ఇటీవల నియోజకవర్గంలో పర్యటించిన జనసేన ముఖ్యనేత, ఎమ్మెల్సీ హరిప్రసాద్ విలేకరులు అడిగిన ప్రశ్నకు షాకింగ్ సమాధానం ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీలో ముందునుంచి అన్నీతామే వ్యవహరించిన వారిని పక్కన పెట్టారని, కొత్తగా వైసీపీలో నుంచి, ఇతర పార్టీల్లో నుంచి వచ్చిన వారిని పార్టీలో ప్రాముఖ్యత ఇస్తున్నారని ముందునుంచి కొంత మందిలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. ఇది నియోజకవర్గంలో పలు సందర్భాల్లో బట్టబయల?ంది.. ఇది చేబ్రోలు సీతారామాలయంలోని జే గంట విషయంలో బయటపడింది. అయితే ఇటువంటి సందర్భాల్లో మంత్రి నాదెండ్ల మనోహర్, లేక ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఇలా ఎవరో ఒక నేతలు వచ్చి సర్ది చెప్పడం పరిపాటిగా మారింది..ఇక్కడ విషయాలన్నీ జనసేనాని దృష్టికి వెళ్లడం లేదని, తమ గోడు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియడం లేదని చాలా మంది జనసేన పార్టీ నేతలే లోలోన మధనపడిన పరిస్థితులున్నాయని విశ్వసనీయంగా తెలుస్తోంది..దీనికి తోడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థానికంగా లేకపోవడం, ఆయన ఏదైనా సమావేశాలుంటేనే హాజరయ్యే పరిస్థితి ఉండడం తమ ఇబ్బందులను ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని జనసేన నేతలు వాపోయిన పరిస్థితి కూడా కనిపించింది.. ఈనేపథ్యంలో జనసేన పార్టీ ఇంచార్జ్ మార్పు జరిగనుందా..?

అందుకే నియోజకవర్గంలో ఈరకమైన వార్తలు హల్‌చల్ చేస్తున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి..

# అమరావతికి హైస్పీడ్ కారిడార్.. కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా నిర్మాణం

విజయవాడ, అక్టోబరు 3, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా- చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చుతుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తున్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

# బెంగళూరు దాటని జగన్



కడప, అక్టోబరు 3, వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయం అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. కానీ ఆయన క్షేత్రస్థాయిలో చేస్తున్న ప్రయత్నాలలో చాలా రకాల లోపాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆయన రాష్ట్రంలో ఉండడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది మొదలు ఆయన ఎక్కువగా బెంగళూరుకు పరిమితం అవుతున్నారు. అక్కడ నుంచి తాడేపల్లి కి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రారంభంలో వారంలో నాలుగు రోజులు పాటు తాడేపల్లిలో ఉండేవారు. అయితే అది క్రమేపి రెండు రోజులకు పడిపోయింది. ఒక్కోసారి తాడేపల్లి కి కనిపించకుండా కూడా మానేశారు. అయితే గతంలో ఇదే జగన్మోహన్ రెడ్డి అండ్ వైసీపీ శిబిరం చంద్రబాబుపై తరచూ ఒక ఆరోపణ చేసేది. చంద్రబాబుతో పాటు లోకేష్ హైదరాబాదులో ఉండి మాట్లాడుతున్నారని ఆరోపించేవారు. ఇప్పుడు అదే పని జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారు. అయితే టిడిపి కూటమి నేతలు ప్రశ్నించడం లేదు కానీ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులే దీనిపై ఎక్కువగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి.వారం రోజుల కిందట జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ప్రారంభించారు. ఎక్కడైనా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కూటమి నుంచి ఇబ్బందులు ఎదురైతే.. డిజిటల్ బుక్ లో వివరాలు నమోదు చేసుకోవాలని.. అధికారంలోకి వస్తే వారందరినీ సప్త సముద్రాలు అవతల ఉన్న తెచ్చి చర్యలు తీసుకుంటామని జగన్మోహన్ రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అయితే ఆ డిజిటల్ బుక్ ను తెరిచి పార్టీ కార్యకర్తలకు చూపించి బెంగళూరు వెళ్ళిపోయారు. తరువాత ఆ డిజిటల్ బుక్ వ్యవహారం అనేది ఏంటి? ఎలా తీసుకెళ్లాలి? అనేది మాత్రం వివరించే ప్రయత్నం చేయలేదు. అసలు ఈ వారం బెంగళూరు నుంచి తాడేపల్లి కి రాలేదు. అటు నుంచి అటే యూరప్ పర్యటనకు వెళ్లనున్నారు జగన్మోహన్ రెడ్డి దంపతులు. అంటే మరో నెల రోజుల పాటు జగన్మోహన్ రెడ్డి అందుబాటులో ఉండరన్నమాట.అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లి విడిచి బయటకు వెళ్లేవారు కాదు జగన్మోహన్ రెడ్డి. బెంగళూరు ముఖం కూడా చూసేవారు కాదు. కానీ ఇప్పుడు బెంగళూరును పట్టుకొని వేలాడుతున్నారు. అక్కడే ఎలహంక ప్యాలెస్ లో ఎక్కువగా విడిది చేస్తున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్నప్పుడు జిల్లాల పర్యటన కూడా చేసేవారు కాదు. ప్రతిపక్షంలోకి వచ్చాక చేస్తామని చెప్పారు. కానీ తాడేపల్లికి వచ్చి ప్రెస్ మీట్ లు పెడుతున్నారు. చంద్రబాబును తిట్టడానికి పరిమితం అవుతున్నారు. ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ప్రస్తావించే సాహసం చేయడం లేదు. ఆ పరిస్థితి కూడా కనిపించడం లేదు. జగన్మోహన్ రెడ్డి ఈ తరహా ప్రదర్శన, దూకుడుతో కూటమిని అడ్డుకోలేరని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# వైసీపీ యూ టర్న్

గుంటూరు, అక్టోబరు 3, ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

అసలు పార్టీ పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లో అంచనా వేసుకోవడానికి కూడా ఈ ఎన్నికలు ఉపయోగపడతాయని జగన్ భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే లోపు జిల్లా, నియోజకవర్గ, బూత్ లెవెల్ కమిటీలను ఏర్పాటు చేసే పనిలో ఉండాలని నేతలకు జగన్ ఆదేశించారట. ఈ ఎన్నికల తర్వాత పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా వెంటనే దానికి స్పందన భారీగా వచ్చే అవకాశముందన్న అంచనాల్లో వైసీపీ అధినేత జగన్ ఉన్నారు.

# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

కాకినాడ అక్టోబరు 3, ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే.ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది.వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు. కుటుంబ సభ్యుల మధ్య వాటాల సమస్యలు తేలక పోవడం వల్ల రిజిస్ట్రేషన్లు ముందుకు సాగలేదు. భూమి బదలాయింపు కాకపోవడంతో చాలామందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. రైతు భరోసా వంటివి వర్తింపు కావడం లేదు. బ్యాంకు రుణాలు లభించడం లేదు. అవసరానికి భూమి విక్రయించేందుకు అవకాశం లేకుండా పోతోంది. అందుకే సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం అమలయితే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం కలగనుంది.అయితే సచివాలయాల్లో వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్కు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అక్కడ సిబ్బందికి శిక్షణ, కంప్యూటర్లు, పరికరాలు అవసరం అవుతాయి. అయితే వారానికి ఒకటి రెండు మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంది. అయితే సచివాలయాల్లోన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు భారీగా ఖర్చు కానుంది. ప్రజలకు సులభతరం చేసే పనిలో భాగంగా ప్రభుత్వంపై ఇప్పుడు ఆర్థిక భారం పడనుంది. అందుకే దీనిపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. కానీ గత ఏడాదిలో భారీగా వచ్చిన ఫిర్యాదులతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే గ్రామ సచివాలయాల్లో ఈ రిజిస్ట్రేషన్ ఎంత వరకు విజయవంతం అవుతుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

# ఏపీకి వాయుగండం

విశాఖపట్టణం, కాకినాడ అక్టోబరు 3ఏపీకి భారీ వర్ష సూచన. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉంది. ఇప్పటికే రాయలసీమలో వర్షాలు దంచి కొడుతున్నాయి. తాజాగా ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో అతి భారీ వర్షాలు పడనున్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తాజాగా అల్పపీడనం ఏర్పడింది. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడింది. ఈ తెల్లవారుజామున 6 గంటల సమయానికి విశాఖకు 300, ఒడిస్సా లోని గోపాల్పూర్ కు 310, పారాదీప్ నకు 400 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. గంటకు పది కిలోమీటర్ల వేగంతో ఇది తీరం వైపు కదులుతోంది. నేటి రాత్రికి గోపాల్ పూర్- పారాదీప్ మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిస్సా తీరాల మధ్య దాటి అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది.వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయి. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదు కానుంది. మిగతా జిల్లాల్లో మాత్రం తేలికపాటి వానలు కొనసాగనున్నాయి.వాయుగుండం తీరం దాటే క్రమంలో భారీ ఈదురుగాలులు కొనసాగనున్నాయి. గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెబుతోంది. శనివారం వరకు మత్స్యకారులు చేపల వేట కోసం వెళ్లకూడదని అధికారులు సూచించారు. మరోవైపు చాలా జిల్లాల్లో పిడుగుల వాన పడే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీచేస్తోంది. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తోంది. కాగా వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో కుండపోతగా వర్షం పడుతోంది. ఈ రాత్రికి వాయుగుండం తీరం దాటనుండడంతో విస్తారంగా వర్షాలు కురిసే ఛాన్స్ కనిపిస్తోంది.


# 11 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి కసరత్తు

అమరావతి, అక్టోబరు 3, ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగులకు పోలీసు శాఖ మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాల భర్తీకి ఆ శాఖ కసరత్తు ప్రారంభించింది. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్పీ, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో ఉన్న ఉద్యోగాలు ఫిల్ చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి పంపించారు డీజీపీ. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఉద్యోగాలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లు రిలీజ్ చేయనున్నారు. సివిల్ పోలీస్ ఫోర్స్‌లో 315 ఎస్సైలు, 3580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ పోస్టులు,2520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని డీజీపీ కార్యాలయం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఏపీ స్టేట్‌లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఈ ఉద్యోగాలను భర్తీకి నోటిఫికేషన్ ఇస్తారు. ఇంకా వివరణాత్మకంగా చూస్తే...

| పోస్టు పేరు | ఖాళీల సంఖ్య |
|---|---|
| ఎస్ఐ(సివిల్) | 182 |
| రిజర్వ్ ఎస్ఐ(ఏఆర్) | 116 |
| రిజర్వ్ ఎస్ఐ(ఎస్ఏఆర్-సీపీఎల్) | 18 |
| రిజర్వ్ ఎస్(ఐఏపీఎస్పీ) | 53 |
| ఎస్ఐ(కమ్యూనికేషన్) | 61 |
| ఎస్ఐ(పీటీఓ) | 14 |
| సివిల్ పోలీస్ కానిస్టేబుల్ఉద్యోగాలు | 3622 |
| ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ | 2000 |
| ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్(డ్రైవర్) | 198 |
| పోలీస్ కానిస్టేబుల్(కమ్యూనికేషన్) | 298 |

ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీవరకు వివిధ విభాగాల్లో గుర్తించిన ఖాళీలను మాత్రమే పంపించారు. నేరస్తులు కొత్త కొత్త విధానాల్లో క్రైం చేస్తున్నారు. సైబర్ క్రైం పెరిగిపోతోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేయాలంటే సిబ్బంది అవసరం అని పోలీసు శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ఉద్యోగాల భర్తీకి వీలైనంత త్వరగా అనుమతి ఇచ్చి నోటిఫికేషన్ ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని సూచించింది.

# ప్రముఖ రచయిత లల్లాదేవి కన్నుమూత



లల్లాదేవి గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ రచయిత పరుచూరి నారాయణాచార్యులు కన్నుమూశారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. గతకొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాత్రి రెండు గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. 1980వ దశకంలో మంచి పాపులారిటీ ఉన్న రచయితలలో లల్లాదేవి కూడా ఒకరు. పాములపై పరిశోధన చేసిన ఏకైక రచయితగా ఆయనకు పేరు. పలు తెలుగు సినిమాలకు కూడా రచయితగా ఆయన పనిచేశారు. 2004లో విడుదలైన శ్వేత నాగు చిత్రానికి కథా రచయిత లల్లాదేవే. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకి ఆయన అత్యంత సన్నిహితులు. కొంతకాలం ఆయన దగ్గర కార్యదర్శిగా కూడా లల్లాదేవి పనిచేశారు. వారి మృతి పట్ల పలువురు సాహితీవేత్తలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ చేశారు. వారి స్వగ్రామం గుంటూరు జిల్లా పత్తిపాడు సమీపంలోని నిమ్మగడ్డవారిపాలెం. ఇప్పటి వరకు ఆయన దాదాపు 250 పై చిలుకు నవలలు రాశారు. కొన్ని వందల కథలు, నాటికలు, నాటకాలు కూడా రాశారు. ప్రముఖ దిన, వార పత్రికలలో సీరియల్ గా కూడా ప్రచురితమయ్యాయి.

# దేవరగట్టు బన్నీ ఉత్సవంలో తీవ్ర విషాదం

## దేవరగట్టు బన్నీ ఉత్సవంలో ఇద్దరు మృతి..

## 100 మందికి గాయాలు



కర్నూలు హ్వాళగుంద వండలం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని జైత్రయాత్రలో హింస చెలరేగింది. కర్రల సమరంలో ఇద్దరు బలి అయ్యారు. వంద మందికి పైగా గాయాలు అయ్యాయి. మృతులు అరికెరికి చెందిన తిమ్మప్ప, కర్ణాటకకు చెందిన బసవరాజు. గాయపడ్డ వారిలో ఐదుగురు పరిస్థితి విషమంగా వుంది. బాధితులకు ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మాళమల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను దక్కించుకునేందుకు పోటీ లో ఈ ఘటన జరిగింది. బన్నీ ఉత్సవానికి రెండు లక్షల మంది తరలివచ్చారు. కర్రలతో కొట్టుకొనే క్రమంలో తీవ్ర గాయాలపాలై మరణాలు సంభవించాయి.

# తీరం దాటిన తీవ్రవాయుగుండం

విశాఖపట్నం బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిశా గోపాల్ పూర్ సమీపంలో తీరం దాటింది. ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ బలహీనపడుతోంది. తీరం దాటిన కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం కొనసాగనుంది. శుక్రవారం ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు అధికారులు జారీ చేసారు. విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసారు.

# చైనాకు విమాన సర్వీసులు

న్యూఢిల్లీ, అక్టోబరు 3, (న్యూస్ పల్స్) కోవిడ్-19 , గల్వాన్ లోయలో సైనికుల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా ఐదేళ్లుగా నిలిచిపోయిన భారత్-చైనా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2న భారత విదేశాంగ శాఖ ఈ ఒప్పందాన్ని ప్రకటించింది. ఈ నెల 26 నుంచి విమాన సేవలు మొదలవుతాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్నాయి. పర్యాటకం, వాణిజ్యం, వ్యాపార భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే లక్ష్యం. ఇండిగో కోల్‌కతా-గ్వాంగ్జౌ సర్వీసులను ప్రకటించింది.కరోనా వైరస్ వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో భారత్, చైనాల మధ్య ఐదేళ్లుగా నిలిచిపోయిన విమాన సర్వీసులు.. పునఃప్రారంభం కానున్నాయి. ఇరు దేశాల మధ్య ఈ అంశంపై పలు దఫాలుగా చర్చలు జరిగాయి. తాజాగా డైరెక్ట్ విమానాల పునఃప్రారంభానికి ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరినట్టు భారత విదేశాంగశాఖ అక్టోబరు 2న ప్రకటించింది. వింటర్ షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకొని.. ఈ నెల చివర నాటికి వివిధ నగరాల మధ్య విమాన సర్వీసులు పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలకు చెందిన ఎయిర్‌లైన్స్ ఏర్పాట్లు చేసుకుంటాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇరు దేశాల పౌరవిమానయాన అధికారుల మధ్య సాంకేతికస్థాయి చర్చలు జరిగినట్టు తెలిపింది. దీంతో అక్టోబరు 26 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.మధ్య సరిహద్దుల్లో ఐదేళ్ల నుంచి నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. కానీ, ప్రధాని నరేంద్ర మోదీ-చైనా అద్యక్షుడు షీ జిన్ పింగ్‌లు, ఇరు దేశాల విదేశాంగ శాఖ అధికారుల మధ్య జరిగిన భేటీల్లో దీనిపై ప్రధానంగా చర్చించారు.. గత కొద్ది నెలలుగా భారత్, చైనాల మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ద్వైపాక్షిక సంబంధాలు క్రమంగా మెరుగుపడుతున్నాయి.

ఆగస్టులో షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం ప్రధాని చైనా వెళ్లినప్పుడు విమాన సేవల పునఃప్రారంభానికి సూత్రప్రాయంగా అంగీకరించాయి. తాజాగా, అవగాహనకు రావడంతో ఐదేళ్ల తర్వాత భారత్, చైనాల మధ్య నేరుగా విమాన సర్వీసులు మొదలుకానున్నాయి.ఇక, విదేశాంగ శాఖ ప్రకటన వెలువడిన కాసేపటికే చైనాకు విమాన సర్వీసుల పునఃప్రారంభంపై ప్రముఖ ఎయిర్‌లైన్స్ ఇండిగో ప్రకటన చేసింది. కోల్‌కతా నుంచి గ్వాంగ్జూ మధ్య అక్టోబరు 26 నుంచి రోజూ నాన్-స్టాప్ సర్వీసులు నడుస్తాయని తెలిపింది. డీజీసీఏ నిబంధనలకు లోబడి ఢిల్లీ-గ్వాంగ్జూ విమానాలను త్వరలోనే నడుపుతామని పేర్కొంది.ఇరు దేశాల మధ్య పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, సరిహద్దు వాణిజ్యం, వ్యూహాత్మక వ్యాపార భాగస్వామ్య మార్గాల పునఃస్థాపనలో భాగంగా ఇండిగో తన ఎయిర్‌బస్ ఎ320 నియో విమానాలను ఉపయోగిస్తుందని తెలిపింది. ఇరుదేశాల మధ్య డైరెక్ట్ విమాన సర్వీసులు నిలిచిపోవడంతో వ్యాపార, పర్యటక, విద్యా రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. దౌత్యపరమైన సంబంధాలు కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈ ప్రకటన ఉద్రిక్తతల తగ్గుముఖం పట్టడానికి సంకేతంగా భావిస్తున్నారు. అమెరికా-భారత్ వాణిజ్య చర్చలు, డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 50 శాతం సుంకాలను విధించిన నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది.

ఎస్‌సీఓ భేటీ అనంతరం మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారు. ఆ తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మోదీ, జిన్‌పింగ్‌లు కలిసి ఫోటోలు దిగారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కసువెళ్లగక్కడం గమనార్హం.

# మన్యం జిల్లాలో ప్రకృతి బీభత్సం

విశాఖ పార్వతీపురం మన్యం జిల్లాలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఒడిశా-ఆంధ్ర సరిహద్దుల్లోని కొఠియా గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకోరిగాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలో వరద బీభత్సంకొనసాగుతోంది. చంపావతి నది పొంగి ప్రవహిస్తుంది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

# పాతకాపుకే కమలం టిక్కెట్

హైదరాబాద్, అక్టోబరు 3,హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బై పోల్ కోసం అన్ని రాజకీయ పార్టీల కుస్తీ పడుతున్నాయి. కాషాయం పార్టీ సైతం కసరత్తు స్పీడప్ చేసింది. ఇప్పటికే కమిటీలు వేసి కాలనీల్లో బూత్ మీటింగ్స్ నడిపిస్తోంది. మానిటరింగ్ కమిటీతో పార్టీ చీఫ్ రాంచందర్ రావు ప్రత్యేక సమావేశం నిర్వహించి.. ప్రస్తుతం ప్రచార వ్యూహాలు, టికెట్ రేసులో ఉన్నవారి పేర్లపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇంతకీ బీజేపీ లేటెస్ట్ జూబ్లీహిల్స్ రూట్ మ్యాప్ ఎంటో తెలుసుకుందాం.గ్రేటర్ హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక కోసం భారతీయ జనతా పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, గరికపాటి మోహన్ రావు, చింతల రామచంద్రా రెడ్డి, గౌతంరావులతో బై పోల్ కి మానిటరింగ్ కమిటీ వేసింది అధిష్టానం. నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు పార్టీ తరుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బూత్ లెవల్ కమిటీలను ఏర్పాటు చేసుకుని చాపకింద నీరులా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాషాయ దళం క్యాంపెయినింగ్ కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, ఇక ముందు అనుసరించాల్సిన వ్యూహాలపై మానిటరింగ్ కమిటీతో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రాంచందర్ రావు అత్యవసర భేటి అయ్యారు. బూత్ లెవల్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యేలా కార్యక్రమా?ల చేపట్టాలని సూచించారు.జూబ్లీహిల్స్ ఓటర్ నాడీ తెలుసుకుని అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించుకుంటున్నారు. ముఖ్యంగా బీజేపీ తరఫున అభ్యర్థి ఎవరన్నదానిపై పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. టికెట్ కావాలంటూ ఇప్పటి వరకు రాష్ట్ర నాయకత్వానికి వచ్చిన వినతులపైనా చర్చించినట్లు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి తనకే మళ్లీ అవకాశం ఉంటుందన్న గట్టి ధీమాతో ఉన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అన్ని కార్యక్రమాలు నియోజకవర్గంలో ఆయనే చూసుకుంటున్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సపోర్ట్ తనకే ఉంటుందని, టికెట్ పక్కా లంకలకే అన్న ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది.మరోవైపు జూబ్లీహిల్స్ బీజేపీ టికెట్ రేసులో లంకల దీపక్ రెడ్డి తర్వాత బలంగా వినిపిస్తున్న పేర్లు కీర్తి రెడ్డి, ఆకుల విజయ, వీరపనేని పద్మ. ఈ ముగ్గురు మహిళా కోటాలో తమకు అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారు. కీర్తిరెడ్డి గతంలోనూ జూబ్లీహిల్స్ టికెట్ ఆశించారు. కిషన్ రెడ్డి అనుచర వర్గం కావడం, ఆర్థికంగా బలంగా ఉండటం, మహిళా కేటగిరీ ఆమెకి కలిసి వస్తుందని అనుకుంటున్నారు. ఇప్పటికే ఆమె తన మనసులోని మాట రాష్ట్ర నాయకత్వం ముందు పెట్టినట్లు తెలుస్తోంది.టికెట్ ఆశిస్తున్న మరో మహిళా నేత ఆకుల విజయ. రాష్ట్రంలో బీసీ చూట్టే రాజకీయం నడుస్తున్న వేళ జూబ్లీహిల్స్‌లో బీసీలకు అవకాశం ఇవ్వాలనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. ఆకుల విజయ బీసీ మహిళ. గతంలో మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేయడం, రాష్ట్ర నేతల్లో కొద్దిమంది మద్దతు ఉండటంతో టికెట్ ఇస్తారన్న ఆశలు పెట్టుకున్నారు. అధికార కాంగ్రెస్ బీసీని బరిలోకి దించాలని చూస్తోందని.. బీజేపీ నుంచి కూడా బీసీనైన తనకు సీటు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. మరో బీజేపీ మహిళా నేత వీరపనేని పద్మ కూడా టికెట్ ఇస్తే పోటీ చేస్తానంటూ రిక్వెస్ట్ పెట్టుకున్నారు.మొత్తంగా ఓ వైపు జూబ్లీహిల్స్ లో గెలుపుకోసం వ్యూహాలు రచిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న కమలం పార్టీ.. గెలుపు గుర్రంగా ఎవరిని బరిలోకి దించుతుందన్న ఆసక్తి కంటిన్యూ అవుతోంది..!

# చార్మినార్ నీడలో గంజాయి బ్యాచ్ ఆగడాలు..

## అడ్డొస్తే దాడులు.. పోలీసన్నలు జర చూడండి..

హైదరాబాద్, అక్టోబరు 3 హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. గంజా తాగి.. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ రెచ్చిపోతున్నారు.హైదరాబాద్‌లో గంజాయి వినియోగం పెరిగిపోతోంది. ముఖ్యంగా పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో దీని ప్రభావం తీవ్రమవుతోంది. ఈ ప్రాంతాలలో గంజాయి బ్యాచ్‌లు విచ్చలవిడిగా తిరుగుతూ అరాచకం సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజలతో పాటు వ్యాపారులను బెదిరిస్తూ.. అన్యాయంగా డబ్బులు వసూలు చేస్తూ.. రెచ్చిపోతున్నారు. ఈ బ్యాచ్‌లు తమకు మామూలు డబ్బులు ఇవ్వకపోతే దాడులు చేయడం, పదేపదే బెదిరించడం, రోజూ వచ్చి వసూళ్లకు పాల్పడటం సర్వసాధారణంగా మారింది. పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల చిరు వ్యాపారులు.. ఈ గంజాయి బ్యాచ్‌ల ఆగడాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.రోజంతా కష్టపడి అమ్మితే వచ్చేది అంతంతమాత్రమే అని, దాన్ని కూడా గంజాయి బ్యాచ్ బెదిరించి లాక్కుంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు. పోలీసులు స్పందించి రక్షించాలని కోరుతున్నారు. చార్మినార్ ప్రాంతం ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం కావడంతో అక్కడికి వచ్చే పర్యాటకులు కూడా ఈ గంజాయి బ్యాచ్‌ల వేధింపులకు గురవుతున్నారు. వారి ఎదుటే రోడ్లపై గంజాయి బ్యాచ్‌లు రౌడీలుగా ప్రవర్తించడంతోపాటు.. పలు ప్రాంతాలను అడ్డాగా చేసుకుని.. వసూళ్ల కోసం గుంపులుగా కూర్చుంటున్నారు. దీంతో పర్యాటకులు భయంతో అక్కడ నిలబడలేకపోతున్నారు.ఇలాంటి వారితో చార్మినార్ పర్యాటక రంగం కూడా దెబ్బతింటోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంఘటనలు పర్యాటకులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా చిరు వ్యాపారులకు కూడా నష్టం తెచ్చిపెడుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి వినియోగాన్ని అరికట్టడంతో పాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలంటున్నారు.

# ఒకే దెబ్బకు రెండు...

## బీఆర్ఎస్ స్థానిక వ్యూహమిదే

హైదరాబాద్, అక్టోబరు 3, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ తన సత్తాను చాటాలని యోచిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని తమను తెలంగాణలో ఎవరూ తుడిచిపెట్టడానికి ప్రయత్నించలేరన్న బలమైన సంకేతాలను ఇవ్వనుంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరుగుతాయి. అదే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మాత్రం పార్టీ గుర్తుతోనే జరగనున్నాయి. దీంతో పల్లె, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరపతి ఏ మాత్రం తగ్గలేదని నిరూపించుకోవడానికి కేటీఆర్ సిద్ధమయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలు కూడా ఫలితాలపై ప్రభావం చూపలేవన్నది జనానికి తెలియజేయాలని భావిస్తున్నారు. తన సోదరి కల్వకుంట్ల కవిత పార్టీ నేతలపై విమర్శలు చేయడంతో ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. కవిత ప్రభావం ఈ ఎన్నికల్లో ఉండకుండా ఉండేలా చూసుకోవాలని నేతలకు కేటీఆర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఈ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అంతా తానే అయి లోకల్ ఎన్నికలను ఎదుర్కొనాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి ప్రచారం వరకూ నేతలను సమన్వయం చేసుకుంటూ వెళతానని, పార్టీ కోసం గత రెండేళ్లుగా పార్టీ కోసం బాగా పనిచేస్తున్న వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వాలని నేతలను ఆదేశించారు.మరొకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా అవలంబిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ కు అనుకూలంగా మారేలా నేతలు వ్యవహరించాలని కేటీఆర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే కొన్ని సీట్లు అత్యధికంగా గెలిచి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఏంటో చెప్పాలని కేటీఆర్ నేతలకు సూచించారు. తాను జిల్లాల వారీగా పర్యటిస్తానని, మరికొన్ని జిల్లాల్లో హరీశ్ రావు కూడా పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన తీరుపై బాకీ కార్డును కేటీఆర్ విడుదల చేశారు. ఈ బాకీ కార్డు ప్రతి ఇంటికి చేరేలా చూడాలని కేటీఆర్ నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలతో ఇటు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అటు కవితను దెబ్బతీసి పార్టీ క్షేత్ర స్థాయిలో బలంగా ఉందన్న విషయాన్ని తెలియజెప్పేలా వ్యవహరించాలని కేటీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు

## చిత్తూరు జిల్లా అంబేద్కర్ విగ్రహ ఘటనపై సీఎం ఆరా

చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. జరిగిన నష్టంపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విగ్రహానికి ఆనుకుని ఉన్న షెడ్డుకు ఆగంతకులు రాత్రి నిప్పు పెట్టడటంతో అంబేద్కర్ విగ్రహానికి నష్టం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. జాతీయ నేతల విగ్రహాలకు అవమానం జరిగేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటిన తీవ్ర వాయుగుండం

విశాఖపట్నం బంగాళాఖాతంలోని ఏర్పడిన తీవ్ర వాయుగుండం శుక్రవారం ఉదమయం ఒడిశా గోపాల్పూర్ దగ్గర తీరం దాటింది. కోస్తా జిల్లాలపై వాయుగుండం ప్రభావం పడనుంది. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాలకు రెడ్అలర్ట్ జారీ చేసారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరంలో ఫ్లాష్ ఫ్లడ్స్ లకు ఆవకాశముంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం వుంది. కాకినాడ, కోనసీమ, తూ.గో, ఏలూరులో భారీ వర్షాల సూచనుంది. ప్రధాన పోర్టుల్లో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరిక ఎగురవేసారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. తెలంగాణలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం, గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం వుంది.

# ఓజీ సినిమా నాకు మళ్ళీ సినిమా చేయాలనే బలాన్ని ఇచ్చింది: చిత్ర విజయోత్సవ వేడుకలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీరగా గర్జించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ సినిమా, భారీ అంచనాల నడుమ సెప్టెంబర్ 25న థియేటర్లలో అడుగుపెట్టింది. తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబర్ 24 రాత్రి నుంచే ప్రత్యేక షోలు ప్రదర్శించబడ్డాయి. మొదటి షో నుంచే అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ను మునుపెన్నడూ చూడని విధంగా దర్శకుడు సుజీత్ చూపించిన తీరుకి అభిమానులు ఫిదా అయ్యారు. పవన్ కళ్యాణ్ స్క్రీన్ ప్రజెన్స్, సుజీత్ దర్శకత్వ ప్రతిభ, తమన్ అద్భుతమైన నేపథ్య సంగీతం, రవి కె చంద్రన్, మనోజ్ పరమహంసల కట్టిపడేసే కెమెరా పనితనం కలిసి.. 'ఓజీ'ని హాలీవుడ్ స్థాయి చిత్రంగా నిలిపాయి. ఓజీ చిత్రం పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు, ప్రేక్షకుల మెప్పు పొందుతూ భారీ వసూళ్ళతో దూసుకుపోతోంది. మొదటి వారాంతంలోనే ప్రపంచవ్యాప్తంగా రూ.252 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసిన ఓజీ.. పవన్ కళ్యాణ్ కెరీర్ లో అత్యధిక వసూళ్ళు రాబట్టిన చిత్రంగా నిలవడమే కాకకుండా, తెలుగు సినీ చరిత్రలో సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం హైదరాబాద్ లోని ట్రైడెంట్ హోటల్ లో చిత్ర విజయోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ తో పాటు, చిత్ర బృందమంతా హాజరై విజయానందాన్ని పంచుకున్నారు.

ఈ వేడుకలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. "ముందుగా ఇక్కడకి వచ్చిన మీడియా వాళ్ళకి, అభిమానులకి, స్నేహితులకి, సోదర సోదరీమణులు అందరికీ ఓజీ యూనిట్ తరుపున నా హృదయపూర్వక నమస్కారాలు. ఓజీ సినిమా అనేది మా అందరికి చాలా చక్కటి అనుభూతి. చాలా అరుదుగా సినిమాలు హిట్ అవుతూ ఉంటాయి, గ్రేట్ కలెక్షన్స్ వస్తుంటాయి. కానీ, ఒక సెలబ్రేషన్ లాగా ఒక సినిమా రిలీజ్ అవ్వడం చాలా తక్కువ సార్లు జరుగుతూ ఉంటుంది. అలాంటి అవకాశం మాకు లభించినందుకు చాలా ఆనందంగా ఉంది. అలాంటి ఒక సినిమా సుజిత్ గారు ద్వారా నాకు రావడం. దానికి తమన్ జీవం పోయడం, రవి కె చంద్రన్ గారు ఫోటోగ్రఫ, ఇమ్రాన్ హష్మీ గారు, ప్రియాంక మోహన్ గారు, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, డీవీవీ దానయ్య గారు ఇలా ఈ సినిమా గొప్పగా రావడానికి కారణమైన అందరికీ కూడా నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఒక సినిమా కథని రాయడం, చెప్పడం చాలా ఈజీ.. కానీ రాసిన కథను తెర మీదకు అలాగే తీసుకురావడం చాలా కష్టం. ఎందుకు అంటే డైరెక్టర్ దగ్గర నుంచి లైట్ మ్యాన్ వరుకు అందరూ కలిసి కట్టుగా పని చెయ్యాలి. అది ఓజీ విషయంలో జరిగింది. మీకు ఒక విషయం చెప్పాలి. అసలు ఇప్పటి వరుకు ఓజీ స్టోరీ ఏంటో నాకు తెలీదు. త్రివిక్రమ్ గారు నేను మాట్లాడుకుంటున్నపుడు సుజిత్ టాపిక్ వచ్చింది. అలా ఓజీ స్టోరీ వినడానికి ఆయనని కలవడం జరిగింది. అప్పుడు ఆయన ఏం చెప్పాడు అంటే, మీరు ఒక కత్తి పట్టుకుని జపానీస్ డ్రెస్ లో ఉంటారు. గన్స్ ఉంటాయి, మీరు ఒక గ్యాంగ్ స్టర్. ఇలాగే చెప్పాడు కథ, నాకు ఏం అర్థం కాలేదు. కానీ సుజిత్ నాకు ఇచ్చిన పేపర్స్ ను మా అబ్బాయి అకీరా నందన్ చదువుతూ చాలా ఆనందం పడుతూ ఉండేవాడు. అప్పుడు అనిపించింది, ఈ తరం వాళ్ళకి అర్థం అయ్యే కథే ఓజీ సినిమా అని. కొన్ని సార్లు సుజిత్ లో నన్ను నేను చూసుకుంటా. ఎందుకు అంటే కొన్ని సార్లు మనం చెప్పాలి అనుకున్నది చెప్పలేకపోవచ్చు, కానీ చేసి చూపించగలం అని నేను బాగా నమ్ముతా. అది సుజిత్ లో నాకు కనిపించింది. అందుకే సుజిత్ కి నేను ఒక మాట ఇచ్చాను. ఓజీ సీక్వెల్ గానీ, ప్రీక్వెల్ గానీ మనం చేస్తున్నాం అని. ఒక ఫ్లాప్ సినిమా ఎంత నిరుత్సాహ పరుస్తుందో నాకు తెలుసు. కానీ ఓజీ సినిమా నాకు మళ్లీ సినిమా చేయాలి అనే బలాన్ని ఇచ్చింది. కాబట్టి నాకు ఉన్న సమయం లో ఓజి యూనివర్స్ కంటిన్యూ చెయ్యాలి అనుకుంటున్నాను. ముఖ్యంగా తమన్ ఇచ్చిన సంగీతం నన్ను తమ్ముడు సినిమా రోజులకి తీసుకువెళ్లింది. అలాగే అర్జున్ దాస్ అతని చూసినపుడు నేను చాలా ఫీల్ అవుతాను అలాంటి గొంతు నాకు లేదు అని. ఓజీ యూనివర్స్ లో భాగం అయిన ప్రతి ఒకరికి నా హృదయపూర్వక ధన్యవాదాలు." అన్నారు.

చిత్ర దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ.. "పవన్ కళ్యాణ్ గారితో ఒక సినిమా చేస్తాను అని నేను ఎప్పుడు అనుకోలేదు. ఒక కథ కూడా రాసుకోలేదు ఆయన కోసం. కానీ ప్రకృతి ఎంత బలమైంది అంటే నన్ను తీసుకువచ్చి పవన్ గారితో సినిమా చేసేలాగా చేసింది. త్రివిక్రమ్ గారి వల్ల ఈ అవకాశం రావడం నాకు సంతోషంగా ఉంది. ఆయనే వచ్చి నువ్వు పవన్ గారితో ఒక సినిమా చేస్తే బాగుంటుంది అని చెప్పడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. తర్వాత డీవీవీ దానయ్య గారిని కలవడం జరిగింది. ఆయన చెప్పిన ఒకే ఒక్క మాట సినిమా ఎలా అయినా హిట్ అవ్వాలి దానికి నీకు ఏం కావాలి. నేను పవన్ కళ్యాణ్ గారికి నా బ్యానర్ లో ఒక హిట్ ఇవ్వాలి అనేసరికి.. నా నోటి నుంచి మాట రాలేదు. అంత సపోర్ట్ చేశారు సినిమా పూర్తి అయ్యేవరుకు. ఇంకా సినిమా బ్యాక్ బోన్ అనిపంచుకుంటున్న తమన్ అన్న సినిమాకే కాదు నాకు కూడా ఒక బ్యాక్ బోన్ లా నుంచున్నాడు సినిమా పూర్తి అయ్యేవరుకు. మిగతా తారాగణం అంతా కూడా సినిమాకి చాలా సపోర్టివ్ గా ఉన్నారు. రవి కె చంద్రన్ గారికి ముందు స్టోరీ చెప్పడానికి వెళ్ళినపుడు 6 గంటలు తీసుకున్న సినిమా ఇలా ఉంటుంది అని చెప్పడానికి. అప్పుడు ఆయన నిజంగా ఈ సినిమా పవన్ గారు ఒప్పుకున్నారా అని అడిగారు. తర్వాత రోజు సెకండ్ హాఫ్ చెప్పే సరికి. ఒకే అదిరిపోయింది ఫస్ట్ హాఫ్ సంగతి మనం చూసుకుందాం అని ఆయన ఇచ్చిన సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేను థాంక్యూ సో మచ్ సార్. పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేస్తునంత సేపు ఆయనని ఒక విషయం అడగడానికి ధైర్యం సరిపోలేదు. ఎలా ఐతే ఒక రోజు ముంబై లో షూటింగ్ జరుగుతున్నప్పుడు టీమ్ మొత్తంతో అడిగించిన తర్వాత నేను అడిగా. సార్ ఈ సినిమా హిట్ అయితే ఇంకొక సినిమా చేద్దాం సార్ అని. అప్పుడు ఆయన ఇచ్చిన సమాధానం వల్లే ఈరోజు ఓజీ యూనివర్స్ స్టార్ట్ అయ్యింది. థాంక్యూ సార్." అన్నారు.

చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య మాట్లాడుతూ.. "నేను ఈ సినిమా చేయడానికి ముఖ్యకారణం, దర్శకుడు త్రివిక్రమ్ గారు. ఆయన వల్లే ఈ సినిమా చెయ్యగలిగాను. అలాగే పవన్ కళ్యాణ్ గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడి, అలాగే ఇష్టపడి మరీ ఈ సినిమాని చేశారు. అద్భుతంగా నటించారు. సుజిత్ కూడా ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. సోదరుడు తమన్ కూడా బాగా కష్టపడి చేశాడు. రవి కె చంద్రన్ గారు, అర్జున్ దాస్ గారు, శ్రియా రెడ్డి గారు, ప్రియాంక మోహన్ గారు, సాంకేతిక నిపుణులు అందరూ కూడా బాగా కష్టపడి చేశారు. ఇంతటి ఘన విజయాన్ని ఇచ్చినందుకు అందరికి నా ధన్యవాదాలు." అన్నారు.

సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. "ఓజీ సినిమా మా అందరికీ ఒక మిరాకిల్ లాంటిది. సుజీత్, నాతో సహా అందరూ ఎంతో భయంతో, బాధ్యతతో ఈ సినిమా చేశారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా టీమ్ కష్టపడి పని చేశారు. ఓజీ సినిమా ప్రయాణాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. ప్రజా నాయకుడిగా పవన్ కళ్యాణ్ గారికి ఉన్న ఇమేజ్ ను, ఆయన అభిమానుల్లో ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకొని సుజీత్, నేను ఎంతో బాధ్యతగా పని చేశాం. ఇది మా విజయం కాదు, పవన్ కళ్యాణ్ గారి అభిమానుల విజయం." అన్నారు.

కథానాయిక ప్రియాంక అరుళ్ మోహన్ మాట్లాడుతూ.. "ఓజీ ని ఇంత పెద్ద హిట్ చేసినందుకు చాలా థాంక్స్. నేను ఇప్పటి వరుకు చాలా సినిమాలు చేశాను కానీ, నాకు ఓజీలో కన్మణి పాత్రకి వచ్చినంత మద్దతు, ప్రోత్సాహం ఏ సినిమాకి రాలేదు.నిజంగా తెలుగు ప్రేక్షకులను ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. కన్మణి లాంటి పాత్ర నాకు ఇచ్చినందుకు దర్శకుడు సుజీత్ గారికి కృతజ్ఞతలు. భవిష్యత్ లో నేను ఎన్ని సినిమాలు చేసినా కన్మణి పాత్ర మాత్రం నాకు ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుంది. అలాగే తమన్ సంగీతం గురించి నేను ముందే చెప్పాను.. థియేటర్స్ మొత్తం ఒక మ్యూజిక్ కాన్సర్ట్ లాగా మారతాయి అని. ఇప్పుడు అదే జరుగుతుంది. నిజంగా ఒక ట్రాన్స్ లో లోకి తీసుకెళ్ళే సంగీతం అందించారు. దానయ్య గారి బ్యానర్ లో రెండో సినిమా చేయడం నాకు చాలా సంతోషం గా ఉంది. ఇలాంటి సూపర్ హిట్స్ ఇచ్చినందుకు దానయ్య గారిని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. పవన్ కళ్యాణ్ గారికి నేను మామూలుగానే మీకు పెద్ద ఫ్యాన్ ని. ఇప్పుడు ఆయనతో కలిసి పని చేసిన తర్వాత ఇంకా పెద్ద ఫ్యాన్ అయిపోయాను. మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది." అన్నారు.

ప్రముఖ నిర్మాత దిల్ రాజు గారు మాట్లాడుతూ.. "పవన్ కళ్యాణ్ గారి అభిమానులు అందరికీ దసరా శుభాకాంక్షలు. ఓజీ సినిమా ప్రకటించినప్పటి నుండి మంచి అంచనాలు ఏర్పడేలా చేశాడు సుజీత్. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ గారి ఫస్ట్ లుక్ విడుదలైనప్పుడు.. కళ్యాణ్ గారిని మనం ఎలా చూడాలి అనుకుంటున్నామో, అలాంటి లుక్ లో చూసినప్పటి నుంచి సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని తెలుగు ప్రేక్షకులంతా ఆత్రుతగా ఎదురు చూశారు. సెప్టెంబర్

24 రాత్రి సుదర్శన్ థియేటర్ లోనే నేను కూడా సినిమా చూడటం జరిగింది. కళ్యాణ్ గారి క్రేజ్ ఎలా ఉంటుందో నాకు తొలిప్రేమ సినిమా నుంచి తెలుసు. ఐతే ఇలాంటి ఒక సినిమాని రాసి, కళ్యాణ్ గారికి చెప్పి ఒప్పించినందుకు సుజిత్ కి చాలా థాంక్స్. అలాగే, ఇలాంటి ఒక బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కళ్యాణ్ గారికి ఇచ్చినందుకు తమన్ కి కూడా చాలా థాంక్స్. చివరిగా ఒక్క మాట.. పవన్ కళ్యాణ్ గారు ఎంత బిజీ గా ఉన్నా ఏడాదికి ఒకసారి ఓజీ లాంటి సినిమా ఇస్తే సంతోషిస్తాం." అన్నారు.ఈ వేడుకలో నటీనటులు శ్రియా రెడ్డి, అర్జున్ దాస్, వెంకట్, ఛాయాగ్రాహకుడు రవి కె చంద్రన్, కళా దర్శకుడు ఏఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొని 'ఓజీ' సినిమా ఘన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్

హైదరాబాద్, అక్టోబరు 3, ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని? ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందింది?ఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మధనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకి మధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగనగా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు.నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమంది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళు _న్నావు నీ ఫేస్ బ్రైట్ గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లను ఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తన సినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియాలో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం?

## సినిమా హబ్‌లో మల్టీప్లెక్స్‌ల హడావిడి..

హైదరాబాద్, అక్టోబరు 3, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా లవర్స్‌కు శుభవార్త. దశాబ్దాలుగా సింగిల్ స్క్రీన్‌లకు కేంద్రమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. ఓడియన్ మల్టీప్లెక్స్ (8 స్క్రీన్‌లు) అక్టోబర్ 24, 2025న.. ఆ తర్వాత సంక్రాంతి 2026కి ఏఎంబీ క్లాసిక్ (7 స్క్రీన్‌లు) ప్రారంభమవుతాయి. మహేష్ బాబు భాగస్వామ్యంతో వస్తున్న ఏఎంబీ క్లాసిక్, సుదర్శన్ థియేటర్ స్థానంలో రూపుదిద్దుకుంది. ఈ కొత్త మల్టీప్లెక్స్‌లతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇక 25 స్క్రీన్‌ల వినోద కేంద్రంగా మారుతుంది.మూవీ లవర్స్ కు ఇది శుభవార్త అనే చెప్పాలి. తెలుగు సినిమాకు ఎప్పుడూ గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా ఎన్నో బాక్సాఫీస్ రికార్డులకు వేదికైన ఈ ప్రాంతంలో.. మొన్నటి వరకు కేవలం పాత తరహా సింగిల్ స్క్రీన్ థియేటర్లు మాత్రమే ఉండేవి. కానీ.. ఇప్పుడు ఆ సంస్కృతి పూర్తిగా మారిపోతోంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఒకేసారి రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి.హైదరాబాద్‌లో సినిమా అంటే గుర్తొచ్చే సంధ్య, దేవి, సుదర్శన్ వంటి ఐకానిక్ థియేటర్లకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సుమారు 18 థియేటర్లు ఉండేవి. వీకెండ్‌లో కొత్త సినిమాల సందడితో ఈ ప్రాంతమంతా కిటకిటలాడేది. ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలకు మల్టీప్లెక్స్ మెరుగులు దిద్దుతున్నారు.

1. ఓడియన్ మల్టీప్లెక్స్ ప్రారంభం

ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఓడియన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ స్థానంలో.. ఇప్పుడు అత్యంత విలాసవంతమైన ఓడియన్ మల్టీప్లెక్స్ రూపుదిద్దుకుంది.

ఇది అక్టోబర్ 24, 2025 న సినీ ప్రియుల కోసం తన తలుపులు తెరుస్తుంది. ఇందులో 8 స్క్రీన్‌లు ఉంటాయి. సినిమా చూసే అనుభవాన్ని పెంచడానికి అత్యాధునిక ప్రొజెక్షన్, సౌకర్యవంతమైన లగ్జరీ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. సినిమా హాల్‌తో పాటు, అందులోనే షాపింగ్ మాల్ కూడా ఉంది. దీంతో ప్రజలు ఒకేచోట సినిమాలు చూస్తూ, షాపింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది.

2. సంక్రాంతికి ఏఎంబీ క్లాసిక్

ఓడియన్ ప్రారంభమైన వెంటనే.. సంక్రాంతి 2026 సందర్భంగా మరో భారీ మల్టీప్లెక్స్ రాబోతోంది. అదే.. ఏఎంబీ క్లాసిక్. ఇది పాత సుదర్శన్ 70ఓఓ థియేటర్ ఉన్న చోట నిర్మిస్తున్నారు.

సూపర్‌స్టార్ మహేష్ బాబుకు హైదరాబాద్‌లో ఇది రెండవ మల్టీప్లెక్స్ వెంచర్ కావడం విశేషం. ఏఎంబీ క్లాసిక్‌లో మొత్తం 7 స్క్రీన్‌లు ఉంటాయి. ఈ మల్టీప్లెక్స్‌లో విడుదల కానున్న మొట్టమొదటి పెద్ద సినిమా 'ది రాజా సాబ్' అయ్యే అవకాశం ఉంది. పీవీఆర్, ఐనాక్స్ వంటి పెద్ద కంపెనీల పోటీని ఏఎంబీ క్లాసిక్ ఎలా ఎదుర్కొంటుందో అని సినీ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

ఈ రెండు మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని స్క్రీన్‌ల సంఖ్య 18 నుంచి 25కు పెరుగుతుంది. అయితే.. ఈ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వీటి వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని.. ఇక్కడ భూమి ధరల పెరుగుదల వల్ల అద్దెలు ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తంమీద.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఈ మార్పు సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి చింతలపూడి తహశీల్దార్ స్లీవరాజు

ఏలూరు ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నట్టు బుధవారం చింతలపూడి తాహశీల్దార్ స్లీవరాజు అన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చింతలపూడి మండలంలో మొత్తం 38 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, ఇప్పటివరకు 7 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, ఈరోజు ఐదు గ్రామాల్లో అనగా నామవరం, పోనుకుమాడు, వెంకటాపురం, వెంకటాద్రి గూడెం గ్రామాల్లో ప్రభుత్వం జరిపిన రీ సర్వేలో గ్రామాల రైతు వారి భూములు కూడా రీ సర్వే పూర్తి చేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశించినీదని, పై గ్రామాల్లో ఈరోజు నుంచి గ్రామసభలు జరుగుతున్నాయని, ఈరోజు నాలుగు బృందాలుగా విడిపోయి ఆయా గ్రామాల్లో సర్వేయర్లు, వీఆర్వోల ద్వారా గ్రామ సభలు ఏర్పాటు చేసి వీటి ద్వారా రీ సర్వే చేయు విధానంపై అధికారులు రైతులకు తెలియజేస్తున్నారు .

అధికారులు ప్రతి రైతు ల భూములు రీ సర్వే నిర్వహించి ఒకరోజు ముందు రైతులకు నోటీసు ఇస్తారని రైతుల భూమికి సంబంధించిన వారి హక్కు పత్రాలను సర్వేకు హాజరయ్యే ముందు పత్రాలు కలిగి ఉండాలని పత్రాలు చూపించిన ఎడల సర్వే చేసి రెవెన్యూ రికార్డులను మార్పు చేస్తారని వారన్నారు. అదేవిధంగా చింతలపూడి మండలంలో రేషన్ స్మార్ట్ కార్డులు వివిధ గ్రామాలకు సంబంధించిన సుమారు 2500 స్మార్ట్ కార్డులు ఉన్నాయని, మీ ఏరియా వీఆర్వో ని మరియు సంబంధిత రేషన్ ఎవరిది డీలర్లను గాని సంప్రదించి, మీ స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకువచ్చుని, అలాగే 2025 ఓటర్ జాబితా మ్యాపింగ్ చేయవలసిందిగా భారత ఎన్నికల కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, బూత్ అధికారులు అందరూ 2002 సంవత్సరం ఓటర్ లిస్ట్ ను 2025 ఓటర్ లిస్ట్ కు మ్యాపింగ్ చేస్తున్నారు, కాబట్టి మండలంలోని ఓటర్లు అందరూ సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కె. దర్శన్, రీసర్వే డిటి డి. సంధ్య కుమారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సహాయం

ఏలూరు లింగపాలెం మండలం రంగాపురంలో సెయింట్ జోన్స్ ఒకేషనల్ సెంటర్ వ్యవస్థాపకులు, ఆస్ట్రియా దేశంలో సేవ చేస్తున్న రెవరెండ్ ఫాదర్ కె.యోహాను సుమారు 10 సంవత్సరాలుగా ఎంతో మంది చదువుకునే పిల్లలకు సంవత్సరానికి 2 సార్లుగా తమ వంతు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ సందర్భంగా రంగాపురం సెయింట్ జోన్స్ ఒకేషనల్ సెంటర్ లో శుక్రవారం పదవ తరగతి లోపు చదువుకునే విద్యార్థులకు 4,000/-రూపాయలు పదవతరగతి నుండి పైన చదువుకునే విద్యార్థులకు 8,000/- రూపాయలు అలాగే విభిన్న ప్రతిభావంతులకు 5,000/- రూపాయలు చొప్పున 70 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము, లింగపాలెం మండల ఎంఈఓ కె.రామారావు, ఎంఈఓ జె రవీంద్ర హాజరయ్యారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా రంగాపురంలో వొకేషనల్ సెంటర్ ను ఏర్పాటు చేసి టైలరింగ్ కంప్యూటర్ శిక్షణ, మరియు స్పోకెన్ ఇంగ్లీష్, లాంటి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఫాదర్ యోహాను ని కొనియాడారు.

# గ్రామాల్లో ఎన్నికల సందడి

హైదరాబాద్, అక్టోబరు 3ప్రాదేశిక ఎన్నికలు మహబూబా బాద్ జిల్లాలో రెండు దశల్లో నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహి స్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న అధికారులు, పోలీసు బందోబస్తు, ఇతర అవస రాల ప్రాతిపదికన నేపథ్యంలో రెండు విడుదల ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మొదటి విడతలు 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 104 ఎంపీటీసీ స్థానాలకు, రెండవ విడత 9 జడ్పిటిసి స్థానాలు, వాటి పరిధిలో ఉన్న 89 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు.రెండు విడతల్లో జరిగే ఎన్నికలకు బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు పూర్తి చేశారు. 18 జెడ్పిటిసి స్థానాలు, 193 ఎంపీటీసీ స్థానాలకు 1,066 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే ఖరారు చేశారు. మొత్తం 5,56,780 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించాల్సి ఉండగా, 24 మంది రిటర్నింగ్ అధికారులను, 22 మంది అసిస్టెంట్ రిటర్న్ అధికారులను నియమించారు.అలాగే 1,279 మంది పోలింగ్ అధికారులను, 5,858 పోలింగ్ సిబ్బందిని నియమించారు. నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 142 మంది ఆర్వో, ఏఆర్వోలను నియమించారు. 12 మంది జిల్లాస్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వివిధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు.

మొదటి ఎన్నికలు జరిగే మండలాలు

బయ్యారం, చిన్న గూడూరు, దంతాలపల్లి, గార్ల, గూడూరు, మహబూబాబాద్, నరసింహులపేట, పెద్ద వంగర, తొర్రూరు ఉన్నాయి. అక్టోబర్ 10 నుండి నామినేషన్ల స్వీకరణ, 23వ తేదీన ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

రెండో దశ ఎన్నికలు జరిగే మండలాలు

డోర్నకల్, గంగారం, ఇనుగుర్తి, కేసముద్రం, కొత్తగూడ, కురవి, మరిపెడ, నెల్లికుదురు, సిరోలు మండలాలు. అక్టోబర్ 13 నుండి నామినేషన్ల స్వీకరణ, 27వ తేదీ ఉదయం 7 నుండి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు.

ఎన్నికలు నిర్వహిస్తారా?

స్థానిక పోరుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినప్పటికీ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన చిక్కులు తొలగిపోతాయా, ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అన్న అంశం ఈనెల 8న స్పష్టమయ్యే అవకాశాలు ఉన్నాయని, ఆ తరువాతే పోటీ వ్యవహారం చూద్దామని ఆలోచనలో వివిధ పార్టీల నాయకులు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.అయితే మరోవైపు ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం జడ్పిటిసి, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయడానికి చాలామంది నేతలు సన్నాహాలు ప్రారంభించారు. అయితే చాలా చోట్ల తమకు అనుకూలంగా పోటీ చేయడానికి రిజర్వేషన్లు అనుకూలించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు.

బీసీలకు పెద్దపీట

మహబూబాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ప్రవేశపెట్టిన 42 శాతం బీసీల రిజర్వేషన్ల వల్ల ఈసారి జడ్పిటిసి, ఎంపీపీ స్థానాల్లో బీసీలకు పెద్దపీట లభించింది. 2019లో 16 ఎంపీపీ, 16 జెడ్పిటిసి స్థానాలు ఉండగా బీసీలకు ఎంపీపీ స్థానాల్లో ఒక్కటి కూడా కేటాయించలేదు.ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో ఆరు స్థానాలు కేటాయించారు. అలాగే 2019లో జరిగిన జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు ఒక్క స్థానం కూడా కేటాయించకపోగా ఇప్పుడు ఏడు స్థానాలను కేటాయించడంతో బిసి వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

# 20 ఏళ్లుగా ఆ గ్రామ ఉప సర్పంచే

ఖమ్మం అక్టోబరు 3, తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్ల సమస్య కారణంగా గ్రామ సర్పంచ్ పదవులు ఖాళీగా ఉంటున్నాయి. ఖమ్మం జిల్లాలోని నూకలంపాడులో ఎస్టీలకు సర్పంచ్ స్థానం కేటాయించినా.. గ్రామంలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీనివల్ల గత నాలుగు టర్మ్‌లుగా ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో నాలుగు గ్రామాల్లో ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేయగా, అభ్యర్థులు కరువయ్యారు. దీంతో ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోయి, ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది.తెలంగాణ రాష్ట్రంలోని పలు షెడ్యూల్డ్ ఏరియాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు విచిత్రమైన పరిస్థితులను సృష్టిస్తున్నాయి. రిజర్వేషన్లు కేటాయింపులో ఉన్న లోపాల కారణంగా కొన్ని గ్రామాలలో సర్పంచ్ పదవి ఖాళీగా ఉండిపోతోంది, ఫలితంగా ఆయా ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతోంది.ఖమ్మం జిల్లాలో విచిత్ర పరిస్థిత.. ఖమ్మం జిల్లా, ఏన్కూరు మండలం పరిధిలోని నూకలంపాడు గ్రామ పంచాయతీలో ఈ విచిత్రమైన పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోంది. మొత్తం 1,063 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామ పంచాయతీని షెడ్యూల్డ్ ఏరియాగా ప్రకటించారు. దీని ప్రకారం సర్పంచ్ స్థానంతో పాటు, మొత్తం ఎనిమిది వార్డుల్లో నాలుగు ఎస్టీలకు రిజర్వ్ చేశారు.దురదృష్టవశాత్తు నూకలంపాడు పల్లెలో ఒక్క ఎస్టీ ఓటరు కూడా లేరు. దీని కారణంగా 2004 నుంచి ఇప్పటివరకు సర్పంచ్ పదవితో పాటు ఎస్టీలకు కేటాయించిన నాలుగు వార్డులు ఖాళీగా ఉంటున్నాయి. గత నాలుగు టర్మ్‌ల ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది. ఈ క్రమంలో.. ఎన్నికలు జరిగిన జనరల్ వార్డుల్లో గెలిచిన సభ్యులలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకొని, ఆ ఉపసర్పంచ్‌కే సర్పంచ్ అధికారాలు అప్పగిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగనుంది.నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలంలో కూడా పరిస్థితి ఇందుకు తగిన విధంగానే ఉంది. ఈ మండలంలోని కల్ములోనిపల్లి, ప్రశాంత్‌నగర్, వంగురోనిపల్లి, కుమ్మరోనిపల్లి అనే నాలుగు గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలను ఎస్టీ మహిళలకు రిజర్వ్ చేశారు. ఈ నాలుగు గ్రామాలలోనూ ఎస్టీ కుటుంబాలు లేకపోవడంతో, సర్పంచ్ అభ్యర్థులే కరువయ్యారు. గత ఎన్నికల్లోనూ ఇలాగే జరిగింది, ఫలితంగా ఐదేళ్లపాటు ఈ పల్లెలలో ప్రత్యేకాధికారి పాలనే కొనసాగింది. ఈసారైనా రిజర్వేషన్లు మారుతాయని ఆశించిన గ్రామస్తులకు మళ్లీ నిరాశే ఎదురైంది.

గ్రామాల అభివృద్ధికి ఆటంకం..

సర్పంచ్ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఈ గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధి లేకపోవడంతో ప్రభుత్వ నిధులు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో కూడా ఎన్.వి. బంజర (బీసీ మహిళ), రాములుతండా (బీసీ జనరల్) గ్రామాల్లో బీసీ ఓటర్లు లేకపోవడంతో, అక్కడ కూడా వార్డు సభ్యుల్లో ఒకరిని ఉపసర్పంచ్‌గా నియమించి, సర్పంచ్ బాధ్యతలను అప్పగించనున్నారు. స్థానిక అధికార యంత్రాంగం స్పందించి.. ఆయా ప్రాంతాల్లోని సామాజిక వర్గాల జనాభా ప్రకారం రిజర్వేషన్లను మార్పు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



సంగారెడ్డి పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ గ్రామ శివారులోని గుర్తుతెలియని మృతదేహం లభ్యం. ఇస్నాపూర్ గ్రామంలోని సూర్యవంశం వెంచర్ వద్ద నీటిలో మృతిదేహాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతి దేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చ్యారీలో భద్రపరిచారు.

# బీమా డబ్బుల కోసం కన్నతల్లిదండ్రులు, భార్య హత్య



లక్నో బీమా డబ్బుల కోసం కన్నతల్లిదండ్రులు, భార్య హత్యఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం సంభల్ లో దారుణం. విశాల్ సింఘాల్ అనే వ్యక్తి తన తల్లి, తండ్రి, మొదటి భార్యలను బీమా డబ్బుల కోసం హత్య చేసాడు. తల్లి పేరిట ఉన్న రూ. 25 లక్షల బీమా, మొదటి భార్య పేరిట ఉన్న రూ. 80 లక్షల బీమా, తండ్రి పేరిట ఉన్న రూ. 50 కోట్ల విలువైన పాలసీల కోసం తండ్రిని హత్య చేసి రోడ్డు ప్రమాదాలుగా చిత్రీకరించాడు. నాల్గవ భార్య శ్రేయను కూడా జీవిత బీమా పాలసీలపై సంతకం చేయాలని బలవంతం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

# సిండికేట్ గా వైన్స్ మాఫియా

నిజామాబాద్, అక్టోబరు 3, కొత్త వైన్ షాపుల ఏర్పాటుకు సర్కారు పచ్చ జెండా ఊపడంతో మద్యం వ్యాపారులు మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు మళ్లీ రెడీ అవుతున్నారు. మద్యం షాపులను దక్కించుకునేందుకు దరఖాస్తుల సమయంలోనే సిండికేట్ గా వైన్స్ మాఫియా ఏకమవుతున్నారు.

మద్యం మాఫియా డాన్లు రంగ ప్రవేశం చేసి చక్రం తిప్పుతున్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మద్యం సిండికేట్ వ్యాపారులు తమ ఆర్థిక పరిపుష్టి, పలుకుబడిన ఉపయోగించి లిక్కర్ దందాను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు మద్యం మాఫియా వైన్ వ్యాపారులతో కలిసి రహస్యంగా భేరసారాలు కుదుర్చుకునే పనిలో నిమగ్నమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల వ్యాప్తంగా కామారెడ్డి, నిజామా బాద్, బోధన్ ఆర్మూర్,ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ ప్రాంతాల్లో నడుస్తున్న వైన్ వ్యాపారాలను బేరీజు వేసుకుంటున్నారు.గడిచిన దినాల్లో ఏ ప్రాంతాల్లో అధికంగా క్రయవిక్రయాలు జరిగాయన్న విషయాన్ని పరిగణంలోకి తీసుకొని ఆయా ప్రాంతాల లో ఉన్న వైన్ షాపులపై మాఫియా దృష్టి పెడుతున్నారు. లిక్కర్ అధికంగా అమ్ముడుపోయే షాపులను చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా షాపులు రిజర్వేషన్ ప్రకారంగా ఉంటే బినామీ పేర్లపై కూడా టెండర్ వేసి సాహసం చేసేందుకు సిద్ధమవుతున్నారు.ఉమ్మడి జిల్లాలో గతంలో2023-2025 సంవత్సరానికి గాను మద్యం వ్యాపారులకు అధిక లాభార్జన జరిగింది. తిరిగి ప్రభుత్వం టెండర్ల కాలం ముగియడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త వైన్ షాపులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.26 సెప్టెంబర్ 2025 నుండి అక్టోబర్ 18వ తేదీ 2025 వరకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియను చేపడుతున్నారు. తదుపరి అక్టోబర్ 23వ తేదీన డ్రా పద్ధతిలో మద్యం దుకాణాలు కేటాయింపు జరిపేందుకు ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టనున్నారు.కొత్త దుకాణాలకు 2025 డిసెంబర్ 1 నుండి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ధారించారు. అయితే గడిచిన టెండర్లలో టెండర్లు వేసే ప్రతి వ్యక్తి రెండు లక్షల రూపాయలు మాత్రమే చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ దఫా ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయలు పెంచుతూ టెండర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

కొత్తగా మద్యం దుకాణాల టెండర్ కు మూడు లక్షలు

కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ఉత్సాహాన్ని చూపే వ్యాపారులు ఒక్కో వైన్ షాప్ కోసం టెండర్ ఫీజు రూ.3 లక్షలు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. అట్టి డబ్బు తిరిగి చెల్లించే అవకాశం ఉండదు. టెండర్ల ప్రక్రియ అనంతరం 2025 డిసెంబర్ 1 న గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు ఐదు శాతం కింద మద్యం దుకాణాలు కేటాయించే విధంగా ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.ఈ దఫా జరిగే టెండర్లలో పోటీ దార్ల సంఖ్య పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. లిక్కర్ దందాల కొనసాగుతున్న వారే కాకుండా, ఇతరులు కూడా వైన్ షాప్ ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. తమ తమ ఏరియాలలో వైన్ షాపులను దక్కించుకునేందుకు ఇతర వ్యాపారాలకు చెందిన వ్యక్తులు కూడా టెండర్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.లిక్కర్ దందాలో లాభాలు ఎక్కువగా రావడంతో వైన్ వ్యాపారంలో కొనసాగేందుకు ఉత్సాహపడుతున్నారు. ఈ మేరకు వైన్ దందాలో ఉన్నవారితో పోటీపడేందుకు సైతం సిద్ధపడుతున్నారు. 2023-25 సంవత్సరానికి గాను క్రితం జరిగిన టెండర్లలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 3579 మంది వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2025- 27 కు సంబంధించి జరిగే టెండర్లలో పోటీదారుల సంఖ్య ఇంత పెరిగే అవకాశాలు స్పష్టమవుతున్నాయి.దఫా 5000 వరకు టెండర్లు నమోదు కానున్నట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో 102 వైన్ షాపులు నడుస్తున్నాయి. వీరి ద్వారా మరో వెయ్యికి పైగా షాపులు అనధికారికంగా( బ్లాక్ షాపులు) కొనసాగుతున్నాయి. ఈసారి లిక్కర్ వ్యాపారులతో కలిసి దందా చేసిన బ్లాక్ షాప్ మద్యం వ్యాపారులు కూడా టెండర్లలో పాల్గొనేందుకు సిద్ధహస్తులవుతున్నారు.

రిజర్వేషన్ షాపులపై దృష్టి..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో లిక్కర్ మాఫియా రిజర్వేషన్ షాపులపై కూడా దృష్టి సారించింది. గౌడ్స్, ఎస్ టి, ఎస్ సి వర్గాలకు వచ్చే షాపులను కైవసం చేసుకునేందుకు ఆయా వర్గాలకు చెందిన నిరుపేద వ్యక్తులతో టెండర్లు వేయించే ప్రయత్నం చేస్తున్నారు. వారి పేరిట షాపులను దక్కించుకొని దందాను నడుపుకునే ప్లాన్ వేస్తు న్నారు.వారికి నయానో భయానో అప్పచెప్పి వారి పేరిట వైన్ షాపును పొంది లిక్కర్ దందాల కొనసాగేందుకు అనుకూలమైన వ్యక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. గత రెండు రోజులుగా మద్యం సిండికేట్ మాఫియా రహస్య సమావేశాలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధానంగా ఎక్కువగా లిక్కర్ అమ్ముడుపోయే అడ్డాలపైనే దృష్టి పెడుతున్నారు. ఆ షాపులపై ఐదు నుండి 10 వరకు వేసేందుకు సైతం రంగం సిద్ధం చేస్తున్నారు.

నిరుద్యోగులు సైతనీ..

మద్యం సిండికేట్ మాఫియా నిరుద్యోగ యువకుల పేర్లతో టెండర్లలో భాగస్వాములను చేసే వాతావరణం కనిపిస్తోంది. వారి పేరిట కూడా షాపులను చేజిక్కించుకొని దందాను పెంపొందించుకునే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ మేరకు వారిపై కూడా ఒకటికి మించి ఐదు వరకు టెండర్ ఫారాలను వేసేందుకు తగిన పైకాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.ఉమ్మడి నిజామాబాద్,కామారెడ్డి జిల్లాలో ఈసారి జరిగే మద్యం టెండర్లలో మద్యం సిండికేట్ మాఫియా డాన్లు తమ ఉనికిని చాటుకొని పెద్ద మొత్తంలో షాపులను దక్కించుకోవడమే కాకుండా అధిక లాభాలను గడించేం దుకు ఉన్న అవకాశాలు అన్నింటిని వాడుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఎక్సైజ్ అధికా రులు సైతం లిక్కర్ మాఫియా కు ఎక్కడెక్కడ ఏ షాపులు దక్కించుకుంటే లాభాలు అర్జించవచ్చు అని విషయాలను అందజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.టెండర్ల ప్రక్రియలో ఎలాంటి మెలుకువలు పాటించా లో కూడా ఎక్సైజ్ అధికారులు తగు సూచనలు ఇస్తున్నట్లు సమాచారం. మరి ఈసారి లిక్కర్ టెండర్లు మాఫియా చేతుల్లోకి వెళ్ళిపోతాయా... కొత్తవారికి దక్కుతాయా.. లే దో. వేచి చూడాల్సిందే..

# హైదరాబాద్కు చేరుకున్న రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్



హైదరాబాద్ హైదరాబాద్లో జరుగుతున్న జీటో కనెక్ట్ కార్యక్రమం సందర్భంగా కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ శుక్రవారం బేగంపేట ఎయిర్పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రానీచందర్ రావు గారు ఆయనకు ఎయిర్పోర్టులో స్వాగతం పలికారు. రాజ్నాథ్ సింగ్ హైటెక్స్లో జరిగే జీటో కనెక్ట్ ప్రారంభ సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

# పల్నాడులో క్షుద్ర పూజల కలకలం

పల్నాడు మాచవరం మండలంలోని వేమవరం నుంచి చెన్నైపాలెం వెళ్లే రహదారిలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. మనిషి ఆకారంలో ముగ్గులు వేసి క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. భయంకరంగా మనిషి రూపంతో పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో పూజలు చేశారు. ఈ దృశ్యాలను చూసిన ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు దృష్టి పెట్టాలని ప్రజల కోరుతున్నారు.

# కేంద్రీయ వి35ద్యాలయం వనపర్తి జిల్లాకు మంజూరు.

**ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు. తెలిపిన వనపర్తి జిల్లా బిజెపి నాయకుడు ఉండే కోటి అంజి.**

వనపర్తి జిల్లా కేంద్రానికి పేదింటి విద్యార్థిని విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆర్థిక భారాలు మోయలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రులకు సెంట్రల్ సిలబస్ ఉన్నత చదువులు చదివి గొప్ప గొప్ప ఉద్యోగాలు పొందడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి పట్టణానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి కృషి చేసిన పోతుగంటి రాములు మాజీ ఎంపీ , ఎంపీ డీకే అరుణమ్మ , బిజెపి ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు డి నారాయణ , కేంద్రీయ విశ్వవిద్యాలయం దాదాపు 120 కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న కేంద్రీయ విశ్వవిద్యాలయం వనపర్తి జిల్లా కేంద్రానికి రావడానికి కృషి చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు ఉందే కోటి అంజి తెలియజేయడం జరిగింది.

# కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ చిరునవ్వు దినోత్సవం ?




స్థానిక రమణయ్య పేట లో కాకినాడ ఐడిఎ ఆధ్వర్యాన ప్రపంచ చిరునవ్వు దినోత్సవం సందర్భంగా పిల్లలకు బ్రష్ లు పేస్ట్ లు అందజేశారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ "ప్రపంచ చిరునవ్వు దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ మొదటి శుక్రవారం జరుపుకుంటారని, ఈ దినోత్సవాన్ని ప్రఖ్యాత 'స్మైలీ ఫేస్' గుర్తును సృష్టించిన అమెరికన్ ఆర్టిస్ట్ హార్వే బాల్ 1999లో ప్రారంభించారని,? నవ్వు యొక్క శక్తిని, ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడం, ప్రజలు చిరునవ్వుతో ఉంటూ, ఇతరులు నవ్వడానికి కారణం కావాలని ప్రోత్సహించడం,?"ఒకరిని నవ్వించేందుకు ఒక మంచి పని చేయండి" అనే నినాదంతో ఈ రోజును జరుపుకుంటారని తెలిపారు. ?నవ్వు అనేది భాష, సంస్కృతి, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరికీ అర్థమయ్యే భాష అని,?నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది మరియు రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు.? నవ్వినప్పుడు ఎండార్ఫిన్లు, సెరోటోనిన్ వంటి హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయని, ఇవి నొప్పిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచుతాయని అన్నారు.? ఇతరులతో చిరునవ్వుతో మాట్లాడటం వల్ల సామాజిక బంధాలు బలపడతాయి మరియు సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ,?ప్రపంచ చిరునవ్వు దినోత్సవం అనేది జీవితంలో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండడానికి నవ్వు ఎంత ముఖ్యమో గుర్తుచేస్తుందని. కాబట్టి,ప్రతి రోజు హాయిగా నవ్వుతూ, నలుగురిని నవ్విస్తూ సంతోషంగా జీవిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఐడిఎ సభ్యులు పిల్లలు పాల్గొన్నారు.

## దుకాణం సముదాయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే.

## వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి

వనపర్తి పట్టణంలో పలు దుకాణ సముదాయాలను ప్రారంభించారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిపై పెద్దమందడి మండలం మనిగిళ్ళ గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు వాటర్ ప్రూఫ్ సొల్యూషన్స్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నారు.యువకుడు ఏర్పాటు చేసుకున్న ఈ దుకాణాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు.అనంతరం కొత్తకోట రోడ్డు ఖీూ ఆఫీస్ పక్కన ఆత్మకూరు మండలానికి చెందిన మహేష్ ఏర్పాటు చేసుకున్న చాయి దుకాణం ఎమ్మెల్యే ప్రారంభించారు.వనపర్తి పట్టణం న్యూ టౌన్ కాలనీకి చెందిన జ్యోతి కొత్త బస్టాండు వెనకాల ఏర్పాటు చేసుకున్న జ్యోతి బ్యూటీ పార్లర్ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఉన్నత చదువులు చదివిన నేటి యువత ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే ఇలాంటి స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తద్వారా భవిష్యత్తు బాగుంటుందని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుధ్ద్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సౌకర్యాలు కల్పించాలి

### కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు

మద్రాస్ అక్టోబర్ 3 ; కరూర్ తొక్కిసలాట ఘటనపై విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు మద్రాస్ హైకోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఆంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.

# భారీ వర్షాలతో ఉప్పొంగిన నాగావళి, వంశధార నదులు

### శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష

### ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం

అమరావతి, అక్టోబర్ 3 భారీ వర్షాలతో నాగావళి, వంశధార నదులు ఉప్పొంగిన నేపథ్యంలో శ్రీకాకుళం, మన్యం, విజయనగరం కలెక్టర్లు, ఎస్పీలతో హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు (శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని... ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వరద సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది వెంటనే స్పందించాలన్నారు.వంశధార, నాగావళి నది లోతట్టు ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని ఆదేశించారు. విపత్తుల సమాచారం, సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. విపత్తుల సంస్థ హెచ్చరిక సందేశం వచ్చినప్పుడు ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచనలు చేశారు.మరోవైపు వంశధార నది పరివాహక ప్రాంతంలో దిగువున ఉన్న గ్రామ ప్రజలకు మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడమైనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటించారు. వంశధార నదికి గొట్ట బ్యారేజ్ వద్ద దిగువకు 1, 04, 891 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అధికారులు ఎప్పకప్పుడు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ స్వప్నిల్ ఆదేశించారు.

### ఏపీ వర్సెస్ కర్ణాటక....

### ట్వీట్ వార్

బెంగళూరు,, అక్టోబరు 3, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే మధ్య ట్వీట్ వార్ నడిచింది. ఏపీని కించపరిచినట్లుగా ప్రియాంక ఖర్గే ట్వీట్ పెట్టడం వివాదాస్పమయింది. భారతదేశంలో అతి పిన్ని రాష్ట్రంగా, మేము పెరుగుదలకు, ఉద్యోగాల సృష్టికి ప్రతి అవకాశాన్ని వెతుకుతున్నాం. రాష్ట్రాలు పెట్టుబడులు, ఉద్యోగాల కోసం పోటీపడితే, భారత్ సమృద్ధి చెందుతుందని నా నిజమైన నమ్మకం. అహంకారం సరి కాదన్నారు..లోకేష్ ఇలా స్పందించడానికి కారణం కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే (ఏఖతీతిఎజీనిఎిష్ట్రజీతీణవ) ఏపీని కించపరుస్తూ ఓ ట్వీట్ పెట్టారు. బెంగళూరు ఆర్థిక ప్రగతి ఉఆఖ 8.5% వృద్ధి, ఆస్తి మార్కెట్ 5% పెరుగుదల ఉందని.. ఆంధ్రప్రదేశ్‌ను దెబ్బతిన్న ప్రాణులు బలమైనవాటి మీద ఆధారపడి బతుకుతాయని.. "పారాసైట్" అని వ్యాఖ్యానించారు.

మాధ్యూఫిలిప్ అనేవ్యక్తి బెంగళూరు ఔటర్ రింగ్ రోడ్ నుంచి నార్త్ సైడ్ ఎక్కువ ఐటీ కంపెనీలకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉందని అన్నారు. దీనికి లోకేష్ స్పందించారు. బెంగళూరు నార్త్ సైడ్ కు సమీపంలోనే అనంతపురం ఉంటుందని .. పెట్టుబడులకు ఆహ్వానించారు. ఇదే ప్రియాంక్ ఖర్గేకు కోపం తెప్పించింది. గతంలో బ్లాక్ బక్ సీఈవో రోడ్లపై గుంతలు ఉన్నాయని రోజులో గంటల తరబడి సమయం వృథా అవుతోందని ట్వీట్ పెట్టారు. అప్పుడు కూడా నారా లోకేష్ ఆ స్టార్టప్ సీఈవోను బెంగళూరుకు ఆహ్వానించారు. స్టార్టప్ యజమానులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని డిప్యూటీ సీఎం శివకుమార్ మండిపడ్డారు. అయితే ప్రజల ఫిర్యాదులను బ్లాక్ మెయిల్గా చూడకూడదని.. సమస్యలుగా భావించి పరిష్కరించాలని లోకేష్ కౌంటర్ ఇచ్చారు.

## శాంతి తోనే అభివృద్ధి సాధ్యం

## ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం

## అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని



హైదరాబాద్ అక్టోబర్ 3 మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకుని రోడ్ నెంబర్ వన్ కెపిహెచ్బి కాలనీ హైదరాబాద్ నందుగల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సందర్భంగా డాక్టర్ పద్మిని గారు మాట్లాడుతూ గాంధీ బోధించిన అహింస శాంతి మార్గంతో ఆ రోజుల్లో ఏ విధంగా స్వాతంత్రాన్ని సంపాదించుకున్నాము అలాగే శాంతితో ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుని సన్మార్గ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలలో గాంధీ బోధించిన శాంతి మార్గాన్ని విద్యార్థుల్లో ప్రభావితం చేసే విధంగా పాఠ్యాంశాలుగా మరింతగా ప్రవేశపెట్టాలని కోరారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ సామాజికవేత్తలు వేల్పూర్ శ్రీనివాస్ విజయదేవి తదితరులు పాల్గొన్నారు

# దసరా పండుగకు రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు



హైదరాబాద్, అక్టోబర్ 3 దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటవ తేదీల్లో మందు బాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30న రూ.333 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేశారని ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అక్టోబర్ ఒకటో తేదీన రూ.86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయి.అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకేరోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయిని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

## పొద్దు తిరుగుడు విత్తనాలు తినడం వాళ్ళ అనేక లాబాలు



హైదరాబాద్ అక్టోబర్ 3 ;సాయంత్రం సమయంలో చాలా మంది చిరుతిళ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. బయట రహదారుల పక్కన బండ్లపై లేదా ఫుడ్ కోర్టులు వంటి వాటిల్లో సమోసాలు, బజ్జీలు, పునుగులతోపాటు బేకరీలలో వివిధ రకాల ఆహారాలను సాయంత్రం సమయంలో స్నాక్స్ లా తింటుంటారు. అయితే ఇవి మన ఆరోగ్యానికి ఎంతో హాని చేస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. డయాబెటిస్, గుండె జబ్బులు వచ్చేలా చేస్తాయి. కనుక ఈ ఆహారాలను తినకూడదు. సాయంత్రం సమయంలో ఆకలి అయితే ఆరోగ్యవంతమైన స్నాక్స్‌ను తినాల్సి ఉంటుంది. ఇవి ఆకలిని తీర్చడమే కాదు, మనకు పోషకాలను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇక అలాంటి ఆరోగ్యవంతమైన స్నాక్స్‌లో పొద్దు తిరుగుడు విత్తనాలు కూడా ఒకటి. చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

హైబీపీ తగ్గేందుకు..

పొద్దు తిరుగుడు విత్తనాల్లో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులతోపాటు ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఆరోగ్యకరమైన కొవ్వుల జాబితాకు చెందుతాయి. అందువల్ల ఈ విత్తనాలను తింటే మెదడు పనితీరు మెరుగు పడుతుంది. కణాల నిర్మాణం సరిగ్గా జరుగుతుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. ఈ కొవ్వులతోపాటు ఈ విత్తనాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. బీపీ తగ్గేలా చేస్తాయి. ఈ విత్తనాల్లో ఉండే మెగ్నిషియం గుండె వేగంగా కొట్టుకోవడాన్ని తగ్గిస్తుంది. దీంతో హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఇ, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి శరీర కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీంతో క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

డయాబెటిస్ ఉన్నవారికి..

పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వుల కారణంగా మనం తినే ఆహారాల్లో ఉండే పిండి పదార్థాలు రక్తంలో గ్లూకోజ్‌గా నెమ్మదిగా మారుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ అమాంతం పెరగకుండా ఉంటాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ఈ విత్తనాల్లో జింక్, సెలీనియం, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలు రాకుండా ఉంటాయి. ఈ విత్తనాల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. ఈ విత్తనాల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక నాన్ వెజ్ తినని వారికి ఈ విత్తనాలను చక్కని ఆహారంగా చెప్పవచ్చు. ఈ విత్తనాలను తింటే ప్రోటీన్లు లభించి శరీరానికి శక్తి అందుతుంది. ఉత్సాహంగా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గిపోతాయి.

ఎలా తినాలి..?

గుప్పెడు పొద్దు తిరుగుడు విత్తనాలను తింటే సుమారుగా 165 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 5.5 గ్రాములు, కొవ్వులు 14.4 గ్రాములు, పిండి పదార్థాలు 6.5 గ్రాములు, ఫైబర్ 3 గ్రాములు ఉంటాయి. అలాగే విటమిన్ ఇ, మెగ్నిషియం, సెలీనియం, జింక్, కాపర్ కూడా ఈ విత్తనాల్లో అధిక మొత్తాల్లో ఉంటాయి. పొద్దు తిరుగుడు విత్తనాలను గుప్పెడు మోతాదులో తినవచ్చు. అధికంగా తింటే వికారం, వాంతికి వచ్చినట్లు అనిపించడం, పొట్టలో అసౌకర్యంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ విత్తనాలను నేరుగా తింటే వికారంగా అనిపిస్తుంది. కనుక పెనంపై కాస్త వేయించి తింటే మంచిది. పొద్దు తిరుగుడు విత్తనాలను సాయంత్రం సమయంలో స్నాక్స్‌లా తినవచ్చు. లేదా రాత్రి నిద్రకు ముందు తినవచ్చు. ఉదయం వ్యాయామం చేసిన తరువాత కూడా తినవచ్చు. ఇలా ఈ విత్తనాలను రోజూ తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# కొత్త నూనె బ్రాండ్ విడుదల - శ్రీపూర్ణ పామోలిన్ ఆయిల్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** తమ ప్రయాణంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ, వృద్ధి అసోసియేట్స్ గర్వంగా తమ స్వంత తినే నూనె బ్రాండ్ శ్రీపూర్ణ పామోలిన్ ఆయిల్ ను ప్రవేశపెడుతోంది. బ్రాండ్ బిల్డింగ్ దిశగా ఈ కీలక అడుగుతో, సంస్థ డిస్ట్రిబ్యూషన్ రంగంలో తమ వారసత్వాన్ని కొనసాగిస్తూ, వినియోగదారులు నేరుగా నమ్మకంగా వినియోగించగల ఉత్పత్తిని అందిస్తోంది.

శ్రీపూర్ణ పామోలిన్ ఆయిల్ స్థిరమైన నాణ్యత, స్వచ్ఛత మరియు విలువను అందించేందుకు రూపొందించబడింది. ఇది గృహ వినియోగదారులు, హోటళ్ళు, రెస్టారెంట్లు మరియు సంస్థాగత కొనుగోలుదారుల కోసం ఉత్తమ ఎంపిక అవుతుంది. వృద్ధి అసోసియేట్స్ బలమైన సరఫరా శృంఖలతో, ప్రతి బొట్టు నూనెలో రుచిని, ఆరోగ్యాన్ని మరియు నమ్మకాన్ని తీసుకురానుంది.

ప్రముఖ వంట నూనె డిస్ట్రిబ్యూటర్లు, వ్యాపారులు, హోల్‌సేల్ మరియు రిటైల్ విక్రేతల సమక్షంలో

ముఖ్య అతిథి

శ్రీ పువ్వాడ శేష మస్తాన్ రావుమ్యానేజింగ్ డైరెక్టర్ హిందుస్తాన్ ఎంటర్ప్రైజెస్, విశాఖపట్నం

గౌరవ అతిథులు

శ్రీ మచ్చ శ్రీనివాస్ రావు

చైర్మన్ సదర్న్ రీజియన్ బిజినెస్ డెవలప్మెంట్, %కాజాలీ

%శ్రీ రాజేష్ అగర్వాల్

చైర్మన్ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్, TPCC

శ్రీ సంజయ్ శుక్లా

హెడ్ కంటెంట్ డెవలప్మెంట్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్

వృద్ధి అసోసియేట్స్ గురించి

వృద్ధి అసోసియేట్స్ హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ప్రముఖ ఎఫ్ఎంసీజీ డిస్ట్రిబ్యూటర్ మరియు సరఫరాదారుగా, తినే నూనెలు, మసాలాలు, పప్పులు, ధాన్యాలు మరియు నెయ్యి వంటి విభాగాల్లో బలమైన ప్రాతినిధ్యం కలిగి ఉంది. బలమైన డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ ఆధారంగా, ఈ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ %చ% కర్ణాటకలోని 3,000కిపైగా ప్రభుత్వ సంస్థలు, రిటైల్ అవుట్లెట్లు, హోల్‌సేల్ డీలర్లు, మాడరన్ ట్రేడ్ స్టోర్లు, కార్పొరేట్ కంటీన్లు, హోటళ్లు, క్యాటరింగ్ యూనిట్లకు సేవలందిస్తోంది.

నమ్మకమైన సేవలు, విస్తృత ప్రామాణ్యం మరియు నాణ్యతా ప్రమాణాల కోసం గుర్తింపు పొందిన వృద్ధి అసోసియేట్స్, విజయ ఆయిల్, ఫ్రీడమ్ ఆయిల్, ఐటీసీ, సన్‌స్టిక్ స్పైసెస్, దుర్గ నెయ్యి మరియు మరెన్నో ప్రముఖ ఎఫ్ఎంసీజీ బ్రాండ్లకు అథరైజ్డ్ రిటైల్ మరియు ఇన్స్టిట్యూషనల్ డిస్ట్రిబ్యూటర్గా ఉంది. ప్రతి భాగస్వామ్యం మరియు ఉత్పత్తి ద్వారా, సంస్థ విలువ, స్థిరత్వం మరియు ఉన్నతతను అందించడంలో నిబద్ధతతో ఉంది, ఆహార సరఫరా గొలుసులో కీలక పాత్ర పోషించడాన్ని మరింత బలోపేతం చేస్తోంది.

# అరేబియా సముద్రం లో తొలి తుఫాను.. 'సైక్లోన్ శక్తి' గా నామకరణం

న్యూ దిఒల్య అక్టోబర్ 3 ;ఈ ఏడాది అరేబియా సముద్రం లో తొలి తుఫాను ఏర్పడింది. భారత వాతావరణ విభాగం తాజాగా ఈ విషయాన్ని వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఈశాన్యం వైపు ద్వారకకు 240 కిలోమీటర్ల దూరంలో, పోరుబందర్‌కు 270 కిలోమీటర్ల దూరంలో అల్పపీడనం ఏర్పడింది.అది వాయుగుండంగా బలపడి గంటకు 12 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ తుఫానుగా మారింది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ తుఫాను కు 'సైక్లోన్ శక్తి' గా నామకరణం చేశారు. ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం.. హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13 దేశాలు ఈ తీరంలో ఏర్పడే తుఫానులకు పేర్లను నిర్ణయిస్తాయి.భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మయన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ దేశాలు తుఫాన్‌లకు పేర్లు పెడుతాయి. కొన్ని తుఫానుల ప్రభావం చాలారోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుఫాను వస్తే ఎక్కడ ఏ తుఫాను ప్రభావం అనే విషయంలో తికమక లేకుండా ఉండటం కోసం తుఫానులకు పేర్లుపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు.తాజా తుఫానుకు 'శక్తి' అనే పేరును శ్రీలంక పెట్టింది. తుఫానులకు పేర్లు పెట్టడం ద్వారా డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుఫాను చెప్పడం, అర్థం చేసుకోవడం సులువు అవుగుంది. అయితే తుఫానులకు పెట్టే పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉన్నది.కాగా ప్రపంచవ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుఫాను హెచ్చరిక కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలు తుఫానులకు సంబంధించి సూచనలు, సమాచారం ఇస్తుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణ కేంద్రం కూడా ఒకటిగా పనిచేస్తోంది.అక్షర క్రమాన్ని అనుసరించి ఒక్కో దేశం ఒక్కో తుఫానుకు పేరును సూచిస్తాయి. ప్రతిసారి ఆ పేరు కొత్తగా, మళ్లీ పునరావృతం కాకుండా ఉండాల్సి ఉంటుంది. తుఫానులకు పేర్లు పెట్టే విషయంలో పలు నిబంధనలు ఉన్నాయి. 'తుఫాను పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు' అనేవి ప్రధాన నిబంధనలుగా ఉన్నాయి.

# విజయ్ పిటీషన్ కొట్టేసిన కోర్టు

చెన్నై అక్టోబరు 3, (న్యూస్ పల్స్) తమిళనాడులోని కరూర్‌లో టీవీకే నిర్వహించిన ప్రచార ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు కోరుతూ సినీ నటుడు విజయ్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మదురై బెంచ్ విచారణ జరిపింది.ఈ సందర్భంగా ధర్మాసనం విజయ్ మరియు ఆయన పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభ దశలోనే ఉందని గుర్తు చేసింది. ఈ సమయంలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సముచితం కాదని పేర్కొంది. కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ బీజేపీ న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది.విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు వంటి ప్రాథమిక సౌకర్యాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ క్రమంలో ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతి ఇవ్వరని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలియజేసింది.

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

ముందస్తు బెయిల్ కోరుతూ టీవీకే నమక్కల్ జిల్లా కార్యదర్శి సతీశ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టివేసింది. ర్యాలీ సమయంలో జనసమూహాన్ని నియంత్రించడంలో పార్టీ ఎందుకు విఫలమైందని న్యాయమూర్తి ప్రశ్నించారు. తొక్కిసలాట బాధితులకు అదనపు పరిహారం కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# సదరన్ ట్రావెల్స్ రెండోసారి గ్లోబల్ టూరిజం అవార్డు 2025



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** భారతదేశంలో అత్యంత విశ్వసనీయంగా, ఎన్నో బహుమతులు అందుకున్న ప్రముఖ ట్రావెల్ సంస్థలలో ఒకటైన సదరన్ ట్రావెల్స్, గ్లోబల్ టూరిజం అవార్డు 2025లో 'బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్'పురస్కారాన్ని అందుకుంది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును సదరన్ ట్రావెల్స్ వరుసగా రెండోసారి గెలుచుకోవడం గర్వకారణంగా నిలిచింది.

గ్లోబల్ టూరిజం అవార్డ్స్ పర్యాటక మరియు హాస్పిటాలిటీ రంగాల్లో అత్యున్నత మరియు ఆధునీకతకు గౌరవం తెలిపే అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం. 2025 సంవత్సరానికి సంబంధించిన ఈ వేడుక నోయిడాలోని ఫిల్మ్ సిటీలో ఘనంగా నిర్వహించబడింది. ఈ అవార్డుల ఎంపికను టూరిజం, హాస్పిటాలిటీ, విమానయాన రంగాలకు చెందిన గౌరవనీయులైన నాయకులు, దూరదృష్టి కలిగిన ప్రముఖులు సభ్యులుగా ఉన్న విశిష్ట జ్యూరీ ప్యానెల్ జాగ్రత్తగా నిర్వహించారు.

ఈ అవార్డును STIC ట్రావెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డాక్టర్ సుభాష్ గోయల్ గారు మరియు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ అధ్యక్షుడు శ్రీ రవి గోసేన్ గారు కలిసి సదరన్ ట్రావెల్స్ కు ప్రదానం చేశారు.

సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కృష్ణమోహన్ అలపాటి గారు ఈ అవార్డు గురించి మాట్లాడుతూ :

"మేము రెండోసారి గ్లోబల్ టూరిజం అవార్డు అందుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాం. మా కస్టమర్ల విశ్వాసం, మరియు మా సంస్థ సిబ్బంది అంకితభావంతో చేసిన కృషికి ఇది గుర్తింపు. సదరన్ ట్రావెల్స్ లో మా లక్ష్యం ఎప్పుడూ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మాత్రమే కాకుండా, స్ఫూర్తిదాయకంగా, మరపురాని అనుభూతిగా చేయడమే. ఇది మాకు పరిశ్రమలో మైలురాళ్లను నెలకొల్పడానికిగాను, మరియు భారత్ను ప్రపంచస్థాయి ప్రయాణ గమ్యస్థలంగా ప్రోత్సహించడానికిగాను స్ఫూర్తినిస్తుంది."

55 ఏళ్లకు పైగా అనుభవంతో, 45 లక్షలకుపైగా సంతృప్తికరమైన కస్టమర్లతో, సదరన్ ట్రావెల్స్ దేశీయ మరియు అంతర్జాతీయ గమ్యస్థలాల్లో కోట్లాది ప్రయాణికులకు మరిచిపోలేని ప్రయాణ అనుభవాలను అందిస్తూ ముందంజలో ఉంది. ఈ అవార్డు గ్లోబల్ టూరిజం రంగంలో సంస్థ యొక్క లక్ష్యాలను మరింత బలపరుస్తుంది. కాలక్రమంలో, సదరన్ ట్రావెల్స్ భారతదేశవ్యాప్తంగా తన సేవలను విస్తరించింది. 2000కి పైగా టూర్ ప్యాకేజీలతో %-% దేశీయ, అంతర్జాతీయ ప్యాకేజీ టూర్లు, కస్టమైజ్డ్ మరియు కార్పొరేట్ ట్రావెల్ సొల్యూషన్లను %-% విస్తృత స్థాయిలో సేవలు అందిస్తోంది. అత్యుత్తమ కస్టమర్ సపోర్ట్ మరియు ప్రపంచ స్థాయి సేవా ప్రమాణాలతో సదరన్ ట్రావెల్స్ నిరంతరం ఆధునికతకు మారుపేరుగ నిలుస్తుంది.

సదరన్ ట్రావెల్స్ గురించి

1970లో శ్రీ అలపాటి వెంకటేశ్వరరావు గారు సదరన్ ట్రావెల్స్ ను స్థాపించారు. ఈరోజు భారతదేశంలోనే అత్యంత విశ్వసనీయమైన ప్రయాణ సంస్థలలో ఒకటిగా నిలిచింది. 2000కిపైగా దేశీయ, అంతర్జాతీయ హాలిడే ప్యాకేజీలు, తీర్థ యాత్రలు మరియు కస్టమైజ్డ్ హాలిడే ప్యాకేజీలతో విస్తృత సేవలను అందిస్తోంది. 55 ఏళ్లకు పైగా అనుభవం, మరియు 45 లక్షలకుపైగా సంతృప్తికరమైన కస్టమర్లతో, విశ్వసనీయత మరియు ఉత్తమ సేవలతో దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలను సాగిస్తుంది.

ఫోన్: 98480 23236

# అరకు కాఫీకి ప్రతిష్టాత్మక అవార్డు... జీసీసీకి సీఎం చంద్రబాబు అభినందన

**అరకు కాఫీకి ప్రతిష్టాత్మక 'బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్' అవార్డు**

**సీఎంను కలిసి అవార్డు చూపిన మంత్రి సంధ్యారాణి, జీసీసీ ఎండీ**

**అరకు కాఫీ గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చిందన్న ముఖ్యమంత్రి**

**టాటాతో ఒప్పందం.. త్వరలో ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి**

**మాకవరపాలెంలో భారీ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు**

అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు దక్కించుకున్న గిరిజన సహకార సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. అరకు వ్యాలీకి కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్సఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. సీఎం చంద్రబాబును మంత్రి సంధ్యారాణి, ఎండీ కల్పన కుమారి నేడు సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని సీఎం పరిశీలించారు.

జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్ గా మారిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువాసనలతో పాటు... ప్రత్యేక రుచిని కలిగి ఉందన్నారు. ఈ విశిష్టత కారణంగా అరకు కాఫీకి మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని సీఎం చెప్పారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన




శైలిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ఇటీవల జీసీసీ-టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని మంత్రి సంధ్యారాణి సీఎంకు వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం గ్రామంలో అధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని... తద్వారా అరకు కాఫీకి మరింత మార్కెట్ వస్తుందని మంత్రి సంధ్యారాణి వివరించారు.

## అమెరికా విశ్వవిద్యాలయాలకు ఇండో-అమెరికన్ల భారీ విరాళాలు..

హైదరాబాద్, అక్టోబరు 3, ఇండో-అమెరికన్లు అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు భారీగా విరాళాలు అందజేస్తున్నట్లు ఒక నివేదిక ద్వారా వెల్లడైంది. ఇండియాస్పోరా సంస, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సంయుక్తంగా '2024 ఇంపాక్ట్ రిపోర్ట్' పేరుతో ఈ నివేదికను రూపొందించాయి. అమెరికా ఉన్నత విద్యావ్యవస్థను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో భారతీయుల విరాళాలు ఏ విధంగా తోడ్పడుతున్నాయో ఈ నివేదిక వివరిస్తుంది.తమ కెరీర్ ప్రారంభంలో తోడ్పాటునందించిన కళాశాలల అభివృద్ధికి అనేకమంది ఇండో-అమెరికన్లు విరాళాల రూపంలో సహాయం చేస్తున్నారని ఇండియాస్పోరా ఛైర్మన్ ఎంఆర్ రంగస్వామి తెలిపారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని ఉద్దేశంతో వారు విరాళాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.దాదాపు 78 శాతం ఇండో-అమెరికన్లు బ్యాచిలర్స్ డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యను అభ్యసించారు. ప్రస్తుతం 2,70,000 మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుతున్నారు. వీరి ద్వారా అమెరికాకు 10 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోంది. ఇది మన కరెన్సీలో సుమారు రూ. 83 వేల కోట్లు. 2008లో ఇండో-అమెరికన్లు అక్కడి విశ్వవిద్యాలయాలకు సుమారు రూ. 25,000 కోట్లు విరాళాలు అందజేశారు. ఈ విరాళాల్లో అధికభాగం మెడికల్, హెల్త్ సైన్స్, ఇంజినీరింగ్, బిజినెస్ ఎడ్యుకేషన్ రంగాలకు వెళుతున్నాయి. సాంస్కృతిక పరిరక్షణ కోసం సుమారు రూ. 1,170 కోట్లు విరాళాలు అందాయి.

# ఇవాళ ఏపీలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభం,

విజయవాడ, అక్టోబరు 3, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ఆటో, క్యాబ్ డ్రైవర్లకు శుభవార్త చెప్పింది. వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రకటించింది. అక్టోబర్ 4వ తేదీన ఆటో, క్యాబ్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకాన్ని ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా అర్హత గల ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందుకోనున్నారు. గత ప్రభుత్వం వాహనమిత్ర కింద ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చగా.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు కారణంగా ఇబ్బంది పడకూడదని క్యాబ్, ఆటో డ్రైవర్ల కోసం కొత్త పథకాన్ని తీసుకొచ్చింది.

మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో రూ.435 కోట్లు జమ

మొత్తం 3,23,375 దరఖాస్తులు రాగా, 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2,90,234 మంది డ్రైవర్లను అర్హులుగా గుర్తించినట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. వారి ఖాతాల్లో మొత్తం రూ.435.35 కోట్లు జమ కానున్నాయి. అర్హులైన లబ్ధిదారుల జాబితాలో పేరు లేకపోతే ఆందోళన చెందవద్దని, సంబంధిత సమస్యను పరిష్కరించి వారి పేర్లను జాబితాలో చేర్చి ఆర్థిక సహాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల స్పష్టం చేశారు. ప్రతి ఏడాది ఈ పథకాన్ని అమలు చేయడానికి ఏపీ ప్రభుత్వం సుమారు రూ.435 కోట్లు ఖర్చు చేయనుంది. ఆటో డ్రైవర్లతో పాటు క్యాబ్ డ్రైవర్లకూ ఈ పథకం వర్తించనుంది. ఈ పథకం ద్వారా డ్రైవర్ల ఆదాయ భద్రతకు దోహదం చేస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

| | సామాజిక వర్గాలు | లబ్ధిదారుల సంఖ్య | ఖాతాల్లో జమయ్యే నగదు |
|---|---|---|---|
| 1 | వెనుకబడిన వర్గాలవారు (ఃఅ) | 1,61,760 | 242,64,00,000 |
| 2 | షెడ్యూల్డ్ కులాలు | 70,578 | 105,86,70,000 |
| 3 | కాపులు | 25,694 | 38,54,10,000 |
| 4 | షెడ్యూల్డ్ తెగ | 13,410 | 20,11,50,000 |
| 5 | రెడ్డి | 7,023 | 10,53,45,000 |
| 6 | ఈబీసీలు | 4,190 | 6,28,50,000 |
| 7 | మైనారిటీలు | 3,968 | 5,95,20,000 |
| 8 | కమ్మ | 2,607 | 3,91,05,000 |
| 9 | క్షత్రియ | 520 | 78,00,000 |
| 10 | బ్రాహ్మణ | 363 | 54,45,000 |
| 11 | ఆర్య వైశ్య | 121 | 18,15,000 |
| | మొత్తం | 2,90,234 | 4,35,35,10,000 |

ఆటో డ్రైవర్ల సేవలో పథకం వివరాలు

- స్కీమ్ ప్రారంభం: అక్టోబర్ 4
- లబ్ధిదారులు: 2.9 లక్షల మంది డ్రైవర్లు
- ఆర్థిక సహాయం: రూ.15,000 వార్షికం
- మొత్తం ఖర్చు: రూ.435 కోట్లు

ఎవరికి: ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు

ఈ పథకం అమలు సందర్భంగా అధికారులు, డ్రైవర్ సంఘాలు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం పెంచి దీన్ని విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. అర్హతల విషయంలో జాగ్రత్తగా పరిశీలన చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందాలని పేర్కొన్నారు.

# పొంచి ఉన్న వాయుగండం

విశాఖపట్టణం, అక్టోబరు 3, రేబియా సముద్రంలో మరో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది క్రమంగా పశ్చిమ దిశగా కదులుతోంది. మరికొన్ని గంటల్లో ఇది వాయుగుండంగా బలపడే అవకాశముంది. భారీ వర్షాలతో ఏపీ ప్రభుత్వం అలెర్ట్ అయింది. తీవ్ర వాయుగుండం ఒడిశాలో తీరం దాటినా, కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. హోం మంత్రి అనిత తాజాగా ఉత్తరాంధ్ర జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజులపాటు కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా శ్రీకాకుళం జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఏర్పాట్లు చేస్తున్నారు.ఈదురుగాలులు ప్రధాన సమస్యగా మారే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించిన ప్రాంతాల్లో, అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని సూచించారు. రోడ్లపై పడే చెట్లను తొలగించడం, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వంశధార, నాగావళి నదుల వరద ప్రభావ ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.

భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే జిల్లాలు

1. శ్రీకాకుళం
2. విజయనగరం
3. పార్వతీపురం మన్యం
4. విశాఖపట్నం
5. అనకాపల్లి
6. అల్లూరి సీతారామరాజు
7. కాకినాడ
8. తూర్పు గోదావరి
9. అంబేద్కర్ కోనసీమ

భారీ వర్షాలు పడే జిల్లాలు

1. ఏలూరు
2. పశ్చిమ గోదావరి
3. కృష్ణా
4. ఎన్టీఆర్
5. గుంటూరు
6. బాపట్ల
7. పల్నాడు
8. ప్రకాశం

గొట్టా బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక

శ్రీకాకుళం: వంశధార నదిలో వరద ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం, గొట్టా బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ పరిణామంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో లోతట్టు ప్రాంతాలు ఇప్పటికే అప్రమత్తం అయ్యాయి. వంశధార నది కి ఇన్ ఫ్లో 80,844 క్యూసెక్కులు, అలాగే ఔట్ ఫ్లో కూడా 80,844 క్యూసెక్కులుగా ఉంది. గొట్టా బ్యారేజ్ వద్ద నీటి స్థాయి ప్రమాదకరంగా పెరుగుతున్నట్లు అధికారులు హెచ్చరించారు. వర్షాలు ఇంకా ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రాంత ప్రజలను అధికారులు సూచించారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

నంద్యాల జిల్లాలో శ్రీశైలం డ్యాంకు తగ్గుతున్న వరద

జలాశయం 10 గేట్లు 10 అడుగులు మేర ఎత్తివేత

జూరాల జలాశయం..2,76,056 క్యూసెక్కులు

సుంకేసుల..17,784 క్యూసెక్కులు

హంద్రీ.. 2,000 క్యూసెక్కులు

ఇన్ ఫ్లో : 2,95,840 క్యూసెక్కులు

ఔట్ ఫ్లో : 3,41,374 క్యూసెక్కులు

పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు

ప్రస్తుతం : 883.90 అడుగులు

పూర్తిస్థాయి నీటి నిల్వ : 215.8070 టీఎంసీలు

ప్రస్తుతం : 209.1579 టీఎంసీలు

కుడి గట్టు, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# ఆ లోగా యుద్ధం ముగించకుంటే మీకు నరకమే!: హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ డెడ్‌లైన్

**తన ప్రణాళికను అంగీకరిస్తూ హమాస్ సంతకం చేయాలన్న ట్రంప్**

**ఆదివారం సాయంత్రం 6 గంటల్లోగా ఒప్పందం కుదుర్చుకోవాలని హెచ్చరిక**

**లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్న ట్రంప్**




యుద్ధాన్ని ముగించాలనే తన ప్రణాళికకు హమాస్ ఆమోదం తెలుపకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపు పలికే అంశంపై ఆయన డెడ్‌లైన్ విధించారు. ఆదివారం సాయంత్రం 6 గంటల్లోగా గాజా ప్రణాళికపై ఒక ఒప్పందానికి రావాలని ఆయన స్పష్టం చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు.

డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహుతో కలిసి 20 సూత్రాల ఫార్ములాను ప్రతిపాదించారు. ఈ ఒప్పందం ప్రకారం, కుదిరిన 72 గంటల్లో బందీలందరినీ హమాస్ విడుదల చేయాలి. ప్రతిగా 250 మంది ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయడంతో పాటు 1,700 మంది సాధారణ పౌరులను కూడా విడిచిపెట్టాలి.అలాగే, గాజా పాలనలో హమాస్ పాత్ర ఉండకూడదని, వారి ఆయుధ వ్యవస్థలను, సొరంగాలను ధ్వంసం చేయాలని ఆయన అన్నారు. ట్రంప్ ప్రతిపాదనలకు ఇజ్రాయెల్ అంగీకరించగా, హమాస్ మాత్రం దీనిపై అధ్యయనం చేశాక నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఇంతవరకు హమాస్ ఎటువంటి నిర్ణయం వెల్లడించకపోవడంతో ట్రంప్ తాజాగా తుది గడువు విధించారు.

# పాకిస్తాన్ కు రాజ్ నాథ్ వార్నింగ్



హైదరాబాద్. అక్టోబరు 3, (న్యూస్ పల్స్) రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. చొరబాట్లకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్ భూజ్ సరిహద్దులో సైనికులతో కలిసి దసరా వేడుకల్లో భాగంగా ఆయుధ పూజలో పాల్గొన్న సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సింధూర్ ఇంకా అమల్లోనే ఉందని ఆయన పునరుద్ఘాటించారు. సరిహద్దుల్లో తోక జాడిస్తున్న పాకిస్తాన్‌కు భారత రక్షణ మంత్రి మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ తప్పవని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. సర్ క్రీక్ ప్రాంతాన్ని తాకాలని చూస్తే తగిన శాస్తి తప్పదని పాకిస్తాన్‌ను గట్టిగా హెచ్చరించారు. సర్ క్రీక్ వైపు కన్నెత్తి చూస్తే చారిత్రకంగా, భౌగోళికంగా పాకిస్తాన్‌ను నామరూపాలు లేకుండా చేసేందుకు భారత ఆర్మీకి ఎంతో సమయం పట్టదని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# గగనతల వ్యవస్థ రక్షణ కోసం 'సుదర్శన చక్ర': ఐఎఎఫ్ చీఫ్

న్యూఢిల్లీ అక్టోబర్ 3 గగనతల రక్షణ వ్యవస్థ 'సుదర్శన చక్ర'ను తయారు చేస్తున్నామని.. ఐఎఎఫ్ చీఫ్ ఎపి సింగ్ తెలిపారు. సుదర్శన చక్ర తయారీకి త్రివిధ దళాలూ పని ప్రారంభించాయి. మరిన్ని ఎస్-400ల కోసం ప్రణాళికలు రచిస్తున్నాం అని తెలిపారు. నిర్దిష్ట లక్ష్యంతో ఆపరేషన్ సింధూర్‌ని ప్రారంభించి త్వరగా ముగించామని ఐఎఎఫ్ చీఫ్ ఎపి సింగ్ తెలిపారు. ఆపరేషన్ సింధూర్ గురించి ఆయన వివరించారు. శత్రువుల స్థావరాలను గురి చూసి కచ్చితంగా కొట్టామని అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో కేంద్రం తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని.. సంక్షోభం ఎలా ఎదురుకోవాలో ప్రపంచం భారత్‌ను చూసి నేర్చుకోవచ్చని కొనియాడారు. పాకిస్థాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. త్రివిధ దళాల సమన్వయంతో ఆపరేషన్ సింధూర్ చేపట్టాం. భవిష్యత్ సవాళ్లు అధిగమించేందుకు రక్షణ రంగంలో ప్వావలంబన అవసరమని తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ విధ్వంసం: కేటీఆర్



హైదరాబాద్ అక్టోబర్ 3 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ సమర్థ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు.గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు."అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థిగా కంజర్ల విజయలక్ష్మి ?



హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ను రేవంత్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆశావహులు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థిని ఖరారు చేయడంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బీఆర్ఎస్ మాగంటి గోపినాథ్ భార్యను అభ్యర్థిగా ప్రకటించింది. మాగంటి సునీతతో పాటు కుటుంబ సభ్యులు ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ మహిళా అభ్యర్థిని బరిలోకి దించడంతో.. కాంగ్రెస్ కూడా అదే స్టాటజీని వర్క్ ఔట్ చేయాలని చూస్తోంది.

మాజీమంత్రి కంజర్ల లక్ష్మీనారాయణ కోడలు కంజర్ల విజయలక్ష్మి ఇక్కడ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లో యాదవ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. మహిళ సెంటిమెంట్ కూడా వర్క్ అవుట్ అయ్యే అవకాశం ఉండటంతో.. కంజర్ల విజయలక్ష్మి పేరు తెరపైకి వచ్చింది. జలగం వెంట్రావు కేబినెట్లో మంత్రిగా పనిచేసిన కంజర్ల లక్ష్మీనారాయణ యాదవ్ కోడలు విజయలక్ష్మి. ఆయన 1973- 78 బీసీ, లేబర్ మినిస్టర్ గా పనిచేశారు. అంతే కాదు లక్ష్మీనారాయణ పేరుపై జూబ్లీహిల్స్ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారు. దీంతో అక్కడి ప్రజల్లో కంజర్ల ఫ్యామిలీకి మంచి పేరుతో పాటు. గుర్తింపు ఉంది.

సేవా కార్యక్రమం చేయడంలో:

నిత్యం ప్రజల్లో సేవా కార్యక్రమాలు చేయడంలో కంజర్ల ఫ్యామిలీ ముందు ఉంది. దీంతో తనకు టికెట్ ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరారు కంజర్ల విజయలక్ష్మి. తనకు టికెట్ ఇస్తే జూబ్లీహిల్స్ ప్రాంతంలోని పలువురు బీఆర్ఎస్ బలమైన లీడర్లు కాంగ్రెస్లోకి వస్తారని, తన గెలుపుకోసం పని చేస్తారని ఆమె చెప్తున్నారు. యాదవ సామాజిక వర్గం తర్వాత జూబ్లీహిల్స్ ప్రాంతంలో కమ్మ సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వారితోనూ తనకు మంచి సంబంధాలు ఉన్నాయని..టికెట్ ఇస్తే తాను గెలుస్తానని పలువురు మంత్రులకు ఆమె చెప్పారు. దీంతో అధిష్టానం కూడా ఆమె పేరును పరిశీలిస్తోందని తెలుస్తోంది.

# మణికొండలో 4 న అలయి బలయ్




**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 3 అక్టోబరు 2025**భారతదేశ అంతర్భాగం తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగర సంస్కృతికి అద్దం పట్టే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విజయ దశమి ఉత్సవాల తదనంతరం అలయి బలయ్ జరుపు కోవడం ఆనవాయితి కాగా అట్టి వేడుకలను మణికొండలో వి ఆర్ 4 సహయోగ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యములో శనివారము 4 అక్టోబర్ 2025 రోజున ఆహ్లాదకర సాయంత్రపు వాతావరణము 4 నుండి 7 వరకు అలకాపూర్ టవున్షిప్ మహాత్మాగాంధీ పార్కు సమీపాన గల ప్రొఫెసర్ జయశంకర్ పార్కు నందు జమ్మి పూజానంతరము మాయా జాల ప్రదర్శన, ధ్వన్యనుకరణ, కోలాటం ఆట పాటలతో ప్రసిద్ధి గాంచిన దసరా సమ్మేళనముకు భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర యువ నాయకుడు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పట్లొల్ల కార్తీక్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు విచ్చేస్తున్న శుభ సందర్భముగా అతిథి దేవుళ్ళుగా మిరు కూడా హాజరు కావాలసినదిగా వినమ్ర పూర్వజముగా వి ఆర్ 4 సహయోగ్ చారిటబుల్ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు సాదరముగా సగౌరవముగా ఆహ్వానిస్తున్నారు.

# రాజన్న ఆలయంలో లడ్డూల కొరత....

## ఒక్కరికి ఐదు లడ్డూలు మాత్రమే....

## అసహనం వ్యక్తం చేసిన భక్తులు.....



**వేములవాడ (ప్రజాబలం దినపత్రిక ) అక్టోబర్ -03** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న క్షేత్రంలో శుక్రవారం రోజున భక్తులకు స్వామివారి ప్రసాదంగా అందియాల్సిన లడ్డూలు సరిపడా తయారు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుండి రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులకు లడ్డూలు కొరత ఏర్పడడంతో ఆవేదన వ్యక్తం చేస్తూ ఆలయ అధికారులు ఐదు లడ్డూలు మాత్రమే ఇస్తున్నారని మునుపెన్నడూ లేని విధంగా ఇలా చేయడం ఏంటని ఆలయ అధికారులపై మండిపడ్డారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాజన్న దర్శనాలను భీమేశ్వర ఆలయంలోకి మార్చే తరుణంలో లడ్డూల కొరత లేకుండా చేయాలని ఎప్పటిలాగా స్వామి వారి ప్రసాదాన్ని అంది ఇవ్వాలని భక్తులు వేడుకుంటున్నారు.

# చౌటాకూర్ మండల నూతన తాసిల్దారుగా కిష్టయ్య



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 03 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** మండల తాసిల్దార్ ఎన్, కిష్టయ్య, బాధ్యతలు స్వీకరించారు, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తాసిల్దార్ కార్యాలయంలో, నాయబ్ తాసిల్దార్ గా , విధులు నిర్వహిస్తున్న కిష్టయ్యను, పదోన్నతి పై చౌటకూర్ మండల తహసిల్దార్ గా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, ఇక్కడ ఇన్చార్జి తహసిల్దార్గా విధులు నిర్వహిస్తున్న అనుదీప్, డిప్యూటేషన్ రద్దు చేశారు, ఆయన స్థానంలో కిష్టయ్యను నియమించడంతో, ఆయన బాధ్యతలు స్వీకరించారు, అమీన్పూర్ లో ఆర్ఐ, గా విధులు నిర్వహిస్తున్న, శ్రీమన్ రాజు,ను పదోన్నతి పై చౌటకూర్ మండల నాయబ్ తాసిల్దార్ గా, నియమిస్తూ ఉన్నతాధికారులు బదిలీ చేశారు, ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు, అనంతరం ఆయన తహసిల్దార్ను అనంతరం ఆయన తహసిల్దార్ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఇదిలా ఉండగా మండల పరిషత్ ఎంపీ ఇదిలా ఉండగా మండల పరిషత్ ఇన్చార్జి ఎంపీఓగా పి సువర్ణను, నియమిస్తూ , ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు, సంగారెడ్డి మండలం ఎంపీఓ గా, విధులు నిర్వహిస్తున్న సువర్ణకు, చౌటకూర్ మండల ఎంపీఓగా, అదనపు బాధ్యతలు అప్పగించారు, ఆమె ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.....

# సింగూర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 03 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలో గల బాగరెడ్డి సింగూరు ప్రాజెక్టుకు, గత వారం 15 రోజులుగా, ప్రాజెక్టు ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాలకు, ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో, ప్రాజెక్ట్ అధికారులు, ప్రాజెక్టులోకి వస్తున్న వరదలను బట్టి ప్రాజెక్టుకు నుండి 11, గేట్లను ఎత్తిన అధికారులు నిన్న ఉదయం 11 గేట్లలోనుండి మూడు గేట్లు తగ్గించి, 8 , గేట్లో ద్వారా 2,00, మీటర్ల వరకు ఎత్తి ప్రాజెక్టు నుండి దిగువకు జలాలను వదిలారు, అయితే ప్రస్తుతం వరదలు తగ్గడంతో ఈరోజు అంటే 03,10,2025, మధ్యాహ్నం రెండు గంటలకు 8 గేట్ల నుండి 6, గేట్లు మూసివేసి, కేవలం 02 గేట్ల ద్వారా 1,5, మీటర్లు ఎత్తి దిగువకు జలాలను వదులుతున్నట్లు, ప్రాజెక్టు అధికారులు ఏఈ, మహిపాల్ రెడ్డి,తెలిపారు.

# దుర్గాదేవి శోభాయాత్రలో పాల్గొన్న మల్లిబాబు యాదవ్





**ఇల్లందు ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాబలం)** శ్రీ శరన్నవ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి పలు మండపాలలో కొలువై ఉండినవరాత్రులు పూర్తి చేసుకుని నవరాత్రులతోపాటు బతుకమ్మ సంబరాలు ను ప్రతి గ్రామము ప్రతి వీధి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గురువారం నాడు కామేపల్లి మండలం లో మరియు పండితాపురం గ్రామంలో జరిగిన శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పలు మండపాల వద్ద ప్రారంభించి ఉత్సాహంగా యువకులు మహిళలతో కోలాటం డాన్సులు స్టెప్పులతో అలరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు



యాదవ్ మాట్లాడుతూ సృష్టిలో శక్తికి ధైర్యానికి ప్రతిరూపమైన అమ్మవారి కరుణాకటాక్షాల వల్ల పచ్చని పైరులతో పంటలు కళకళలాడాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటున్నట్లుగా, దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ అంటేనే ప్రతి ఒక్కరికి ఎంతో ఆనందకరమైన పండుగని, విద్యార్థులకు దాదాపు 15 రోజులు దాకా సెలవులు రావడం వలన బంధువులు అమ్మమ్మల ఇండ్లకు వెళ్లి సంతోషంగా గడుపుతారని హర్షం వ్యక్తం చేశారు. దసరా పండుగకు ఒక ప్రత్యేకత ఉందని చెడుపై మంచి విజయం సాధించిన రోజు అని , పురాణాల ప్రకారం దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసుడిని సంహరించడం వలన ఆరోజు విజయదశమి కావడం వలన మనం ఉత్సవం జరుపుకుంటున్నామని, అంతేకాకుండా విజయదశమి రోజుననే శ్రీరాముడు రావణాసురుని సంహరించాడని, అదే విజయదశమి రోజున పాండవులు జమ్మి చెట్టుపై దాచిన తమ ఆయుధాలను విజయదశమి రోజున పూజ చేయడం వలన అప్పటివరకు రహస్యంగా ఎవరికీ కనిపించకుండా ఉన్న ఆయుధాలు తిరిగి తమ చేతులకు రావడం వలన యుద్ధం చేయటం వలన గెలుపు సాధించారు. పురాణాలలో ఏ కథలో ఎలాంటిది ఉన్నప్పటికీ సారాంశం మాత్రం చెడుపై మంచి తప్పక ఎప్పుడైనా గెలుస్తుంది అని దాని అర్థం అని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాలలోని మహిళలు యువకులు, ప్రజలు భారీ ఎత్తునశోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లికార్జునరావు, శీలం పుల్లయ్య ఎస్.కె రబ్బానీ పాషా దేరంగుల తిరపయ్య రాయల నాగ శంకర్ భూక్య నాగేంద్రబాబు, బాదావత్ నాగరాజు, బానోతు ముత్తయ్య, బోడ నాగు, గుగులోతు కిషన్, బానోతు సీతారాములు, రాయల వెంకన్న, పాడి బండ్ల ప్రసాద్ బానోతు వీరనాగులు బండి ఉపేందర్ బానోతు శ్రీను మేకల మహేష్, మేకల లక్ష్మీనారాయణ, తురక బిక్షం బండి ఎల్లయ్య బత్తుల ఉపేందర్ గొడుగు సాయి బత్తుల ఎల్లయ్య తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు

# చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు

## కొట్లాట కేసులో నిందితుల అరెస్ట్

## మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శశిధర్ రెడ్డి




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 3:**మందమర్రి సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాల చెట్టు ఏరియాలో గురువారం తాగిన మైకంలో ఇద్దరు యువకులపై విచక్షణారహిత దాడి చేసిన కేసులో నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు మందమర్రి పట్టణ సీఐ కె. శశిధర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో జరిగిన సంఘటనలో ఇద్దరు యువకులపై కొంత మంది యువకులు విచక్షణారహితంగా దాడి చేసారన్నారు.

పాల చెట్టు ఏరియాలో ఉన్న పచ్చిక రవితేజ మరియు బండ రాకేష్ అనే యువకులపై, మందమర్రి విద్యానగర్కు చెందిన కొందరు యువకులు ఆటోలో వచ్చి, ఆటో యు టర్న్ చేసుకునే సందర్భంలో అదే సమయంలో బైక్ మీద అదే రోడ్డు వెంబడి వెళ్తున్న ఇద్దరు యువకులు ఆటోకు అడ్డు రాగా చిన్నపాటి విషయానికి అక్కడ ఘర్షణకు దిగారన్నారు. తాగిన మైకంలో ఉన్న యువకులందరూ కలిసి బాధితులపై చేతులతో, కర్రలతో మరియు రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. ఈ దాడిలో పచ్చిక రవితేజ తలకు గాయాలయ్యాయని

బాధితుడు పచ్చిక రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటోలో వచ్చి దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. నిందితుల జిల్లపల్లి ఆకాష్ ఏ బన్నీ, కోట మహేష్, రెండ్ల శ్రీకాంత్, దానబోయిన నవీన్ కుమార్, పులి సతీష్, జిల్లపల్లి ఆకాష్ స్నేహితుడు (పేరు తెలియని వ్యక్తి) లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు జిల్లపల్లి ఆకాష్ మరియు అతని స్నేహితుడు పరారీలో ఉన్నారన్నారు. మిగిలిన నిందితులు పోలీసుల అదుపులోకి తీసుకోవడం జరిగిందనీ మరియు పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని,నేర ప్రవృత్తిని విడనాడకుండా, కొనసాగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించి అవసరమైతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ కూడా నమోదు చేయవడానికి వెనకాడబోమని ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి హెచ్చరించారు.

# కాకా వెంకటస్వామి కుటుంబం కార్మికులకు అండగా ఉంటుంది

# తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

## అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

## ముఖ్యఅతిథిగా కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ దంపతులు

## అలరించిన కళాకారుల నృత్యాలు







**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 3:**కార్మిక లోకానికి కాకా వెంకటస్వామి కుటుంబం ఎప్పుడు అండగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. దసరా వేడుకలను పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో గురువారం ఏర్పాటు చేసిన రావణ వధ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని దర్శనం చేసుకుని దుర్గమాతను ఊరేగింపుగా భక్తుల దర్శనం కోసం సింగరేణి హై స్కూల్ గ్రౌండ్ లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం దసరా వేడుకల్లో ఎంఎల్ఏ గా ఇక్కడ పాల్గొన్నానని అప్పుడు మీరు ఇచ్చిన ఆశీర్వాదంతో నేను మంత్రిగా మళ్లీ మీ ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్మిక శాఖ మంత్రిగా ఉన్న తన హయాంలో కార్మికులకు జీతాలు పెంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల స్వంత ఇంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి అమలు చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఇటీవల సింగరేణి రిటైర్ కార్మికుల పెన్షన్స్ కోసం తమ తనయుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంటులో మాట్లాడి నిధి ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఒప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. రానున్న కాలంలో చెన్నూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. జి. ఎం ఎన్ రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సహకారంతో మందమరి ఏరియా అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందని ఇదే సహకారాన్ని అందించి సింగరేణి సంస్థలు కాపాడుకోవాలని ఆయన కోరారు కార్మికుల సంక్షేమం కోసం సింగరేణి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని ఆయన అన్నారు ఈ సందర్భంగా కార్మికులకు కార్మికుల కుటుంబాలకు ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు ప్రజల సహకారంతోనే ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఏ టి సి రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కార్మికులకు పెర్క్ ఇన్కమ్ టాక్స్ విషయాలపై రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చొరవ తీసుకోవాలని కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దయ్యేలా కృషి చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా పి.ఎం విజయ ప్రసాద్, ఎస్. ఓ. ట. జి.ఎం శ్యామ్ సుందర్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాధుని సుదర్శన్, మల్లేష్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, కంది శ్రీనివాస్, కలువల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాధనవేణి ప్రభాకర్ బృందం ఆర్కెస్ట్రా పాటలు, యూట్యూబ్ డాన్సర్స్ క్రేజీ విజయ్, తస్లీమ్ బృందం కళాకారులు కిరణ్, వెంకీ, చందు, ఉప్పులేటి స్వరలయ, మీనా, కావ్య, చందన చేసిన జానపద నృత్యాలు టాలెంట్ డాన్స్ అకాడమీ కొరియోగ్రాఫర్ సునార్కర్ రాంబాబు బృందం చేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం రావణ వధ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దంపతులు ప్రారంభించారు. కాగా అరగంట పాటు వివిధ



రకాల విన్యాసాల బాంబుల మోతలతో గ్రౌండ్ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. పిల్లలు పెద్దలు కేరింతల కొడుతూ రావణవధ కార్యక్రమాన్ని ఆద్యంతం తిలకించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ కె. నరేందర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ శివనీతి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

# విజయదశమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సన్నగారి కొండల్ రెడ్డి





వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 3( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి / పంచలింగాల్ గ్రామంలో దసరా పండగ పూజా కార్యక్రమంలో పాల్గొన్న వికారాబాద్ మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ స నగారి కొండల్ రెడ్డి గ్రామ ప్రజలందరూ ఐక్యమత్యంతో కలిసికట్టుగా సంతోషంగా ఊరేగింపుతో ఊరి బయట ఉన్న జమ్మి చెట్టుకు పూజ చేసి అనంతరం వెండి బంగారం గా భావించే ఆకులను తీసుకుని మళ్లీ ఊరేగింపుతో ఆటలతో సంతోషంగా గ్రామాన్ని చేరుకొని మందిరంలో దేవుని దర్శించుకుని తమ తమ ఇండ్లకు వెళ్లి ఒకరిని ఒకరు ఆప్యాయంగా ఆనందంగా అలాయి బలాయి తీసుకుంటూ సంతోషంగా పండుగ సంబరాలు జరుపుకున్న టు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పురోహితులు గ్రామ ప్రజలు యువకులు చిన్నలు పెద్దలు సంతోషంగా జరుపుకున్నట్టు తెలిపారు

# సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ సస్పెండ్...

## ఓ కేసు దర్యాప్తులో భాగంగా ఒక వ్యక్తి నుండి డబ్బు డిమాండ్ చేసిన ఎస్ఐ రవీందర్ పై ఎస్పీ సీరియస్.



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 03(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/మల్టీ జోన్-2 ఐజీపీ ఆదేశాల మేరకు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు,ఈ సందర్భంగా ఎస్పీ ఒక ప్రకటనలో వివరిస్తూ సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్ కు సంభందించిన ఓ కేసులో రవీందర్ ఎస్ఐ ఒక వ్యక్తి నుండి డబ్బులను అడిగినందుకు గాను, సంబంధిత వ్యక్తి డబ్బులు ఇవ్వలేనని,మన స్థాపానికి లోనై నదిలోకి దూకి అదృశ్యమయ్యాడు. అందుకు సంబంధించి మిస్సింగ్ అయిన వ్యక్తి యొక్క భార్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో, ఎస్పీ సంగారెడ్డి డీఎస్పీ ద్వారా ప్రాథమిక విచారణ జరిపించి, నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు రూరల్ ఎస్ఐ పై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేసి, మల్టీ జోన్-2ఐజీ ఆదేశాల మేరకు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ ను విధుల నుండి సస్పెండ్ చేసినట్లు తెలిపారు,విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని,ఏ స్థాయి లో ఉన్న వారైన శాఖపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# గుండెపోటుతో బిఆర్ఎస్ కార్యకర్త మృతి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ మున్సిపల్ విలీన గ్రామమైన నాంపల్లి గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త వేములవాడ శ్రీనివాస్ (46) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లడంతో తన తండ్రి మరణ వార్త తెలుసుకొని కడసారి చూపు కోసం హుటాహుటిన స్వగ్రామానికి బయలుదేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వేములవాడ శ్రీనివాస మృతితో నాంపల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అమ్ముకున్నా యి. శనివారం రోజున అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి బి ఆర్ ఎస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించాడని పార్టీ శ్రేణులు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ఒక చురుకైన కార్యకర్తను బిఆర్ఎస్ పార్టీ కోల్పోయిందని పార్టీ నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ శ్రీనివాస్ కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు విన్నవిస్తున్నారు.

# దుర్గామాత కృప వల్ల సమస్త మానవాళి సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలి..సత్యం శ్రీరంగం

## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి..



**కూకట్పల్లి (ప్రజాబలం) అక్టోబర్ 03:** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలోని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. అనంతరం ఆలయ పూజరులు వేద మంత్రలతో ఆశీర్వదించి, తీర్ద ప్రసాదాలు అందచేశారు. భూలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ విశాల్ సూదం, చిత్తరమ్మా, రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ మాధవరం శ్రీనివాసరావు ఆహ్వానల మేరకు అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఈ సందర్బంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో దసరా పండుగ జరుపుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. విజయ దశమి పండుగ సందర్భంగా నియోజక వర్గ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తులు సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకుంటామన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, అన్నింటా విజయాలు సిద్ధించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహిత్, అరుణ్ గౌడ్, కృష్ణ, కృష్ణ రావు (బాల), నరేష్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్తో గతంలో ఇల్లు దగ్ధం, దసరా రోజున నూతన గడప పెట్టుకున్న కుటుంబం.

## ఇందిరమ్మ ఇల్లుతో నెరవేరిన సొంత ఇంటి కల. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు.





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** గత కొద్ది మాసాల క్రితం కరెంటు షాట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం కావడంతో పాటు ఇంట్లోనే సామాగ్రి పూర్తిగా దగ్ధమై దిక్కుతో తోచని స్థితిలో పడిపోయిన పేదింటి కుటుంబానికి వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అండగా నిలిచిన విషయం అందరికీ తెలిసిందే, వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామానికి చెందిన గొర్రె రాజవ్వ బిమైసయ్య దంపతుల ఇల్లు గత కొన్ని మాసాల క్రితం కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైంది, అయితే విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం పక్షాన అట్టి కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని అప్పటికప్పుడు మంజూరు చేశారు. అయితే గురువారం జరిగిన దసరా పండుగ రోజున ఇందిరమ్మ గృహ నివాసానికి గొర్రె రాజవ్వ కుటుంబ సభ్యులు నూతన గడప పెట్టుకొని సొంతింటి కలను నెరవేర్చుకోపోతున్నారు. అయితే ఈ బృహత్తర కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ప్రభాకర్, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్రవంతి బిహరి నందన్ రెడ్డి దంపతులు, ఇందిరమ్మ గృహ నివాస నివాస కమిటీ సభ్యులు తడి గొప్పల రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇల్లు దగ్ధమైతికి తోచిన స్థితిలో పడిపోయి ఉన్నప్పుడు కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ కుల సంఘాలతో పాటు, ప్రజా ప్రతినిధులకు, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గొర్రె రాజవ్వ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. మరి కొద్ది రోజులలో నూతన గృహం పూర్తి కానుండడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి గారి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్.

## ఉత్తరాంధ్ర వానలపై చంద్రబాబు సమీక్ష

విజయవాడ, అక్టోబరు 3, (న్యూస్ పల్స్)ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ తదితర జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రస్తుతం జిల్లాల్లో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులను అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గొట్టా బ్యారేజ్ క్యాచ్ మెంట్లో 33 టీఎంసీలు, తోటపల్లి పరిధిలో 11 టీఎంసీలు మేర వర్షపాతం నమోదు అయ్యిందని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజికి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం కలెక్టర్ తెలిపారు. ఒడిస్సాల్లోని ప్రాంతాల్లో పడిన భారీ వర్షాల కారణంగా వంశధారకు 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని వివరించారు.ఇప్పటి వరకు భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా నలుగురు మృతి చెందినట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు అధికారులు. విశాఖ నగరం కంచరపాలెం లో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ఒకరు మృతి చెందినట్లు చెప్పుకొచ్చారు. దీనిపై స్పందించిన సీఎం బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షం లేదని.. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో నదుల్లో వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల చెట్లు కూలాయని.. ఇప్పటికే 90 శాతం కూలిన చెట్లను తొలగించామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాదాపు 90 శాతం మేర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు ఈపీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. ఇవాళ సాయంత్రం లోగా అన్ని ప్రాంతాల్లోనూ విద్యుత్ పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్దరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.




# బీసీ బిల్లును గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించాలి.

## బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్య, ఉద్యోగాలలో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ, రాష్ట్ర అఖిలపక్ష నేతల సంపూర్ణ సహాయ సహకారాలతో పలుమార్లు ఉభయ సభలో ఏకగ్రీవంగా బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ కు రాష్ట్రపతికి, కేంద్ర ప్రభుత్వానికి పంపించిన బిల్లుల ఆమోదం, ఆర్డినెన్స్ లో ఆమోదం గత కొన్ని నెలల నుండి పెండింగ్లో ఉన్న విషయం విధితమే అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50% మించకూడదు అని సుప్రీంకోర్టు విధించిన ఆంక్షలు ఉన్నందున, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సమగ్ర కుటుంబ కుల గణన సర్వేలో బీసీ జనాభా 56.33 శాతం అని తేలినందున, సుప్రీంకోర్టు విధించిన పరిమితిని పెంచుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవో 9 ని జారీచేసి ఎట్టకేలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, ప్రత్యేక జీవో 9 చట్ట విరుద్ధమని కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ధర్మాసనం అక్టోబర్ 8వ తేదీన విచారణ జరుపటకు నిర్ణయించడం జరిగిందని పొలాస నరేందర్ పేర్కొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు రాష్ట్రంలో అఖిలపక్ష పార్టీలు, దాదాపుగా నేతలందరూ మద్దతు తెలుపుతున్నప్పటికీ, రిజర్వేషన్లు చట్టబద్ధంగా, శాస్త్రీయంగా అమలుకు నోచుకోవడం లేదని, అక్టోబర్ 8వ తేదీన హైకోర్టు తీర్పు వ్యతిరేకంగా వస్తే, పార్టీ పరంగా రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు తరచూ ప్రకటించడం పట్ల బీసీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం పరుస్తున్నారని, అలాగే కేసు కోర్టులో విచారణ ఉండగా ఎన్నికల షెడ్యూల్ ఎలా విడుదల చేశారని, దసరా తదుపరి బీసీ గర్జన సభ నిర్వహిస్తామని, ఎన్నికలలో ఎవరికి వారు పార్టీ జెండా ఎగరవేసి తీరుతామని, కోర్టు కేసు తేలేంతవరకు అభ్యర్థులు జాగ్రత్తగా ఉండి, ఎన్నికలలో డబ్బు ఖర్చు పెట్టవద్దని, ఈ విధంగా వివిధ పార్టీల నేతలు రకరకాలుగా ప్రకటనలు జారీ చేస్తున్నారని, రిజర్వేషన్ల విషయంలో మొదటి నుండి ముందడుగు వేసిన నేతలు, పార్టీలు ఈనెల 8వ తేదీన కోర్టు విచారణ లోపున గవర్నర్ను ఒప్పించి చట్టబద్ధంగా, శాస్త్రీయంగా రిజర్వేషన్లు అమలు జరిగేలా, స్థానిక సంస్థల ఎన్నికలు చిక్కుల్లో పడకుండా, సజావుగా జరిగేలా కృషి చేయాలని అఖిలపక్ష నేతలందరూ కి పొలస నరేందర్ విజ్ఞప్తి చేశారు.

# శాంతి తోనే అభివృద్ధి సాధ్యం

## ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పద్మిని



హైదరాబాద్ అక్టోబర్ 3 మహాత్మా గాంధీ జయంతి ని పురస్కరించుకుని రోడ్ నెంబర్ వన్ కెపిహెచ్బి కాలనీ హైదరాబాద్ నందుగల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సందర్భంగా డాక్టర్ పద్మిని గారు మాట్లాడుతూ గాంధీ బోధించిన అహింస శాంతి మార్గంతో ఆ రోజుల్లో ఏ విధంగా స్వాతంత్రాన్ని సంపాదించుకున్నాము అలాగే శాంతితో ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుని సన్మార్గ మార్గంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలలో గాంధీ బోధించిన శాంతి మార్గాన్ని విద్యార్థుల్లో ప్రభావితం చేసే విధంగా పాఠ్యాంశాలుగా మరింతగా ప్రవేశపెట్టాలని కోరారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కెబి శ్రీధర్ ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్ సామాజికవేత్తలు వేల్పూర్ శ్రీనివాస్ విజయదేవి తదితరులు పాల్గొన్నారు



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com